PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 58 | విజయవాడ, గురువారం 28 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol 43 No 58 | Vijayawada, Thursday 28 September 2023 | Rs 5.50

**అసెంబ్లీ నిరవధిక వాయిదా**

- సిఎం ప్రసంగం లేకుండానే ముగింపు
- సస్పెన్షన్, బహిష్కరణలతో టిడిపి దూరం

2

6

**నాల్గోరోజు ఎనిమిది..**

- 3స్వర్ణ, 3రజిత, 2 కాంస్య పతకాలు
- 22 పతకాలతో 7వ స్థానంలో భారత్

# జిపిఎస్‌కు ఆమోదం

- శాసనసభలో ఏకపక్షం
- మండలిలో పిడిఎఫ్ తీవ్ర నిరసన
- ఒపిఎస్‌తో దివాళా తీస్తాం : బిల్లు ప్రవేశపెడుతూ బుగ్గన




**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఉద్యోగ. ఉపాధ్యాయలు వ్యతిరేకతను ఏ మాత్రం ఖాతరు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ బిల్లును ఆమోదించింది. శాసనసభ సమావేశాల చివరిరోజైన బుధవారం బిల్లును ఉభయసభల్లోనూ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. శాసనసభలో ప్రతిపక్షమే లేకపోవడంతో చర్చ, ఓటింగ్ ఏకపక్షంగా సాగింది. మూజువాణి ఓటుతో శాసనసభ జిపిఎస్ బిల్లును ఆమోదించింది. మండలిలో పిడిఎఫ్ సభ్యులు తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. వీరి నిరసనల మధ్యే బిలులను ఆమోదిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. అంతకు ముందు శాసనసభలో ఆంధ్రప్రదేశ్ గ్యారెంటీడ్ పెన్షన్ సిస్టిమ్ బిల్-2023 (జిపిఎస్)ను రాష్ట్ర ఆర్థకశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాధ్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జిపిఎస్ ను తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు కోరుతున్న ఒపిఎస్‌ను అమలుచేయడం సాధ్యం కాదని అన్నారు.

మొండిగా అమలు చేయాలని నిర్ణయించినా భవిష్యత్తులో దివాళా తీయడం ఖాయమన్నారు. 10 ఏళ్ల తర్వాత ఉద్యోగులకు జీతభత్యాలిచ్చే పరిస్థితి ఉండదన్నారు. రాజకీయం, ఎలక్షన్ల గురించి మాత్రమే ఆలోచిస్తే మమ అనిపించడం సాధ్యమే కానీ, భావి తరాల గురించి ఆలోచిస్తే సాధ్యంకాదన్నారు. రాష్ట్ర ఆర్థికస్థితిగతులను దృష్టిలో ఉంచుకుని హైబ్రీడ్ మోడల్ యైన జిపిఎస్ అమలుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పదవీ విరమణ చేసిన ఎపి జిపిఎస్ చందాదారు పొందిన వార్షిక మొత్తంలో తగ్గుదల ఉంటే చివరిగా డ్రా చేసిన మూల వేతనంలో 50శాతం చొప్పున నెలవారీ ఫించను ఇస్తారని చెప్పారు. వార్షిక మొత్తంలో ఏదైనా తగ్గుదల ఉన్న నేపథ్యంలో రూ.10వేల టాప్ అప్ మొత్తాన్ని నెలవారీ కనీస హామీ పింఛన్ ఉండేటట్లు చూస్తామన్నారు.

**జిపిఎస్ ప్రయోజనాల కోసం షరతులు:**

జిపిఎస్ ఉద్యోగి హామీ పింఛన్ విధానం పొందేందుకు పలు షరతులను బిల్లులో పొందు పరిచారు. పదవీ విరమణ చేస్తున్నట్లయితే కనీసం 10 సంవత్సరాలు అర్హతగా సర్వీసు ఉండాలి. స్వచ్ఛంద పదవీ విరమణ చేసేటట్లయితే కనీసం 20 సంవత్సరాలు సర్వీసు తప్పని సరి. ప్రజాప్రయోజనం దృష్ట్యా పదవీ విరమణ చేస్తే కనీసం 33 సంవత్సరాలు సర్వీసు అర్హతగా నిర్ధేశించారు. వైద్య పరంగా సర్వీసు నుంచి పదవీ విరమణ చేసినచో కనీసం 10 సంవత్సరాలు సర్వీసు తప్పని సరి.

**జిపిఎస్‌కు అనర్హులు వీరే:**

ఎపిజిపిఎస్ చందాదారు రాజీనామా చేసిన కారణంగా సర్వీసు నుంచి విరమిస్తే జిపిఎస్‌కు అనర్హులని పేర్కొన్నారు. సర్వీసు నుంచి బర్తరఫ్ అయినవారు. సర్వీసు నుంచి తొలగింపునకు గురైనవారు, క్రమశిక్షణ చర్యల కారణంగా తప్పనిసరిగా ఉద్యోగ విరమణ చేయల్సివచ్చిన వారు జిపిఎస్‌కు అనర్హులు . అదే విధంగా ఉద్యోగ విరమణ చేసిన సమయంలో క్రమశిక్షణ, న్యాయపరమైన ప్రొసీడింగ్‌లు జరుగుతూ ఉంటే అవి పూర్తయిన తరువాతే పెన్షన్ చెల్లింపులు ఉంటాయని బిల్లులో పేర్కొన్నారు.

### పిడిఎఫ్ ఆగ్రహం

- పోడియంపైకి ఎక్కి బిల్లు ప్రతులు చించివేత
- సభ నుంచి వాకౌట్

రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ బిల్లును ప్రవేశపెట్టడంపై శాసనమండలిలో పిడిఎఫ్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాధ్ బిల్లును ప్రవేశపెట్టగానే పిడిఎఫ్ సభ్యులు తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, షేక్ షాబ్జీ, స్వతంత్ర ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ నిరసన వ్యక్తం చేశారు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ పునరుద్దరిస్తామని హామీ ఇచ్చారని నాలుగు ఏళ్లగా ఈ హామీని పట్టించుకోకుండా ఇప్పుడు జిపిఎస్ తెరపైకి తెచ్చి చట్టం చేయడం ఏమిటని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. రాష్ట్రంలో మూడున్నర లక్షల మంది సిపిఎస్ ఉద్యోగులను నమ్మించి నిలువునా మోసం చేశారని అన్నారు. ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, షేక్ షాబ్జీ, రఘువర్మ పోడియంపైకి ఒక్కసారిగా దూసుకువెళ్ళి బిల్లును ఆమోదించవద్దని ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. బిల్లు ప్రతులను చింపి గాల్లోకి వేశారు. పోడియంపై నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

'చీటింగ్..చీటింగ్' అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్సీల నిరసన మధ్యనే బిల్లు ఆమోదం పొందినట్లు ఛైర్మన్ ప్రకటించారు. దీంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తే ముగ్గురు ఎంఎల్‌సిలు సభ నుండి వాకౌట్ చేశారు.

## బాబు పిటిషన్లు వాయిదా

- సుప్రీంకోర్టులో 3వ తేదికి
- ఎసిబి కోర్టులో 4వ తేదికి
- విచారణ నుండి తప్పుకున్న జస్టిస్ ఎస్‌విఎన్‌భట్టి

**ప్రజాశక్తి - న్యూఢిల్లీ, అమరావతి**

స్కిల్ స్కామ్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సుప్రీంకోర్టు,ఎసిబి కోర్టుల్లో దాఖలు చేసిన పిటిషన్లు వాయిదా పడ్డాయి. స్క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పి) అక్టోబర్ 3వ తేదికి వాయిదా పడింది. ఎసిబి కోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ 4వ తేదికి వాయిదా వేశారు. . దీంతో పాటు సిఐడి దాఖలు చేసిన రిమాండ్ పిటిషన్‌నుకూడా ఎసిబి కోర్టు అక్టోబర్ 4వ తేదికి వాయిదా వేసింది. అంతకుముందు సుప్రీంకోర్టులో చంద్రబాబు దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పి జస్టిస్ ఖన్నా, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టి (సరస వెంకట నారాయణ భట్టి)ల బెంచి ముందు విచారణకు వచ్చింది. అయితే, కేసు విచారణకు తీసుకోక ముందే తాను 2013 నుండి 2019 వరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా పనిచేశానని, అందువల్ల విచారణ నుండి తప్పుకుంటున్నట్లు జిస్టిస్ ఎస్‌విఎస్ భట్టి ప్రకటించారు. దీంతో కేసు విచారణపై ఉత్కంఠ నెలకొంది. చంద్రబాబు తరపు న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, హరీష్ సాల్వేలు సాధ్యమైనంత త్వరగా విచారణ చేపట్టాలని, వాయిదా వేయడం ఒక్కటే మార్గం కాదన్నారు. జస్టిస్ ఖన్నా అనుమతితో లూథ్రా ఎస్‌ఎల్‌పి విషయాన్ని మరోసారి చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ముందు ప్రస్తావించారు. జస్టిస్ ఎస్‌విఎన్ భట్టి విచారణ నుండి తప్పుకున్న విషయం చెబుతూ ఎస్-ఎల్‌పిపై తక్షణమే విచారణ జరపాలని ఆయన కోరారు. దీనికి స్పందించిన ప్రధాన న్యాయమూర్తి రిలీఫ్ కావాలంటే బెయిల్‌కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించగా దానికి లూథ్రా తిరస్కరించారు. 'మేం బెయిల్ అడగడం లేదు. సాధ్యమైనంత త్వరగా కేసును లిస్ట్ చేయాలని కోరుతు న్నాం, 17 ఎ సెక్షన్ ప్రకారం చంద్రబాబును అరెస్ట్ చేయడానికి గవర్నర్ అనుమతి తీసుకోవాలి. అలా జరగలేదు. అలా చేయలేదు. జడ్ కేటగిరి ఉన్న వ్యక్తిని జైల్లో పెట్టారు. ఇది ఆందోళన కలిగిస్తోంది. సిఐడి కస్టడికి అడుగుతోంది. దాని నుండి మినహా యిస్తూఆదేశాలు ఇవ్వండి' అని ఆయన కోరారు. ఈ విజ్ఞప్తిని చీఫ్ జస్టిస్ తిరస్కరించారు. ఈ దశలో అటువంటి ఆదేశాలు ఇవ్వలేమని చెబుతూ అక్టోబర్ 3వ తేదికి విచారణను వాయిదా వేశారు.

**ఎసిబి కోర్టులో....**

సిఐడి వేసిన కస్టడి పిటిషన్, చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లు ఎసిబి కోర్టులో బుధవారం విచారణకు వచ్చాయి. చంద్రబాబును తమ కస్టడికి ఇస్తే విచారణను పూర్తి చేస్తామని సిఐడి తరపు న్యాయవాదులు కోరారు. వారు వాదనలను కొనసాగిస్తుండటంతో విచారణను 5వ తేదికి వాయిదా వేయాలనుకుంటున్నట్లు న్యాయమూర్తి చెప్పారు. దీనికి తమ వాదనలు పూర్తి చేయాలని సిఐడి తరపు న్యాయవాదులు కోరారు. విచారణను ప్రస్తుతానికి వాయిదా వేయాలని, శుక్రవారం తమ వాదనలు వినిపిస్తామని బాబు తరపు న్యాయవాదులు చెప్పడంతో న్యాయమూర్తి కొంత అసహనం వ్యక్తం చేశారు. బెయిల్ పిటిషన్ దాఖలు చేసి 17 రోజులైనా ఎందుకు వాదనలు వినిపించడం లేదని ప్రశ్నించారు. కోర్టు సమయాన్ని వృద్ధా చేయవద్దన్నారు. అనంతరం కస్టడి, బెయిల్ పిటిషన్లు రెండింటిని 4వ తేదికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. వీటితో పాటు అమరావతి రింగ్‌రోడ్, ఫైబర్ నెట్ కేసుల్లో పిటి వారెంట్ల విచారణను కూడా ఎసిబి కోర్టు 4వ తేదికి వాయిదా వేసింది.

రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డికి పురస్కారం అందచేసి, సన్మానిస్తున్న వి.బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

**స్వచ్ఛమైన కవి గుర్రం జాషువా**

- జయంతి సభలో వక్తలు
- రాచపాళెంకు జాషువా కవితా పురస్కారం

లోపలి పేజీలో..

**బైజూస్‌లో వేలాది మందిపై వేటు..!**

- కొత్త సిఇఒ ప్రణాళికలు

## విద్యుత్ భారాలపై దద్దరిల్లిన కలెక్టరేట్లు

- రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యాన ఆందోళనలు
- కాకినాడలో అరెస్టులు, మహిళలను అసభ్యపదజాలంతో దూషించిన డిఎస్‌పి
- ప్రయివేటీకరణను తిప్పికొట్టాలి : బివి రాఘవులు
- విద్యుత్ సంస్కరణల బిల్లుపై వైసిపి, టిడిపి వైఖరిని స్పష్టం చేయాలి : వి శ్రీనివాసరావు

నెల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో) నెల్లూరు కలెక్టరేట్ వద్ద ప్రసంగిస్తున్న బివి.రాఘవులు

**ప్రజాశక్తి- యంత్రాంగం**

విద్యుత్ భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఉద్యమించాయి. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూ అప్ సర్దుబాబు సర్‌ఛార్జి, అదనపు ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయవద్దని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసి, ఎస్‌యుసిఐ, ఫార్వర్డ్‌బ్లాక్, ఎంపిసిపిఐ (యు) చేపట్టిన ఆందోళనలతో కలెక్టరేట్లు దద్దరిల్లాయి. పలు జిల్లాల్లో ర్యాలీలు జరిగాయి. కాకినాడలో నిరసన తెలుపుతున్న వారిపై డిఎస్‌పి అసభ్యపదజాలంతో విరుచుకుపడడం, బలవంతంగా అరెస్టులకు పాల్పడడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

నెల్లూరులో కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు మిగతా 5లో

### ఎఐఐబిలో మరో మూడు దేశాలు

**షర్మ్ ఎల్ షేక్, ఈజిప్ట్ :** ఆసియాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఎఐఐబి)లో తాజాగా మరో మూడు దేశాలు చేరాయి. అవి ఎల్ సాల్వడార్, సోలోమన్ ఐలండ్స్, టాంజానియా. మంగళవారం నాడిక్కడ జరిగిన ఎఐఐబి ఎనిమిదవ వార్షిక సమావేశంలో బ్యాంక్ గవర్నర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపినట్లు ఆ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో ఈ బ్యాంక్‌లో చేరిన దేశాల సంఖ్య 109కి పెరిగింది. సభ్య దేశాలతో ఎఐఐబి సహకారం మరింత బలోపేతం అయిందనడానికి ఇదొక ఉదాహరణ. ఎఐఐబి ఈ విషయంలో ఇప్పటికే మంచి రికార్డు కలిగివుందని బ్యాంక్ అధ్యక్షుడు, డైరెక్టర్ల బోర్డు చైర్మన్ జిన్ లిక్వన్ తెలిపారు. తాజాగా మూడు ఆర్థిక వ్యవస్థలు చేరడంతో ఎఐఐబి కమ్యూనిటీ మరింత బలోపేతమైందని అన్నారు.. రేపటి అవసరాల కోసం మౌలిక సదుపాయాలకు ఆర్థిక సాయాన్ని అందించాలనే ఉమ్మడి కర్తవ్యానికి మద్దతుగా నిలుస్తాయన్నారు. అవసరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత అధికారికంగా ఈ మూడు దేశాలు ఎఐఐబిలో చేరతాయని బ్యాంక్ తెలిపింది.

## ఆదివాసీల సర్నా కోడ్‌ను గుర్తించాలి

**ప్రధాని మోడీకి జార్ఖండ్ సిఎం సోరెన్ లేఖ**

**రాంచి :** గిరిజనులకు సర్నా మతపరమైన కోడ్‌ను గుర్తించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోడీకి జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బుధవారం మూడు పేజీల లేఖ రాశారు. గత ఎనిమిదేళ్ళలో రాష్ట్రంలో గిరిజనుల జనాభా 38శాతం నుండి 26శాతానికి క్షీణించిందని సోరెన్ ఆ లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఐదవ, ఆరవ షెడ్యూళ్ళ కింద గిరిజనుల అభివృద్ధి కోసం రూపొందించే విధానాలపై గిరిజనుల జనాభా తగ్గడమనేది ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. గిరిజనుల ప్రయోజనాల కోసం సర్నా ధర్మ కోడ్‌ను ఆమోదించాల్సిందిగా ఆయన ప్రధానిని కోరారు.

గిరిజన సమాజానికి చెందినవారు ప్రాచీన సంప్రదాయాలను అనుసరిస్తూ ప్రకృతిని ఆరాధిస్తారని, చెట్లు, కొండలు, అడవులను పూజిస్తూ వాటిని పరిరక్షిస్తూ, వాటినే మతంగా భావిస్తారని అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం, దేశంలో దాదాపు 12కోట్ల మంది గిరిజనులు వున్నారు, అందులో జార్ఖండ్‌లో కోటికిపైగా గిరిజనులు వున్నారని అన్నారు.

"జార్ఖండ్‌లో మెజారిటీ జనాభా సర్నా మతాన్ని అనుసరిస్తారు. ఈ పురాతన మతమైన సర్నాకు సజీవంగా వున్న గ్రంథాలంటే అవి నీరు, నేల, అడవి, ప్రకృతినే. ప్రస్తుతమున్న మతాలకు భిన్నంగా సర్నా మత ఆచారాలు, విశ్వాసాలు, సంప్రదాయాలు, ఆరాధనా పద్ధతులు వుంటాయి. ప్రకృతి ఆధారంగా ఆదివాసీల సంప్రదాయ మత అస్తిత్వాన్ని పరిరక్షించాలనే ఆందోళన కచ్చితంగా తీవ్రమైన సమస్యగా వుంది. ప్రకృతిని ఆరాధించే ఈ ఆదివాసీల కమ్యూనిటీ తమ గుర్తింపు గురించి ధీమాగా వుండగలిగేలా సర్నా మత పరమైన కోడ్‌ను గుర్తించాలనే డిమాండ్ తలెత్తింది." అని సోరెన్ పేర్కొన్నారు.

కేవలం జార్ఖండ్‌లోనే కాదు, యావత్ దేశంలోని గిరిజన కమ్యూనిటీ కూడా అనేక సంవత్సరాలుగా తమ మత అస్తిత్వ పరిరక్షణ కోసం పోరాడుతున్నాయని సోరెన్ చెప్పారు. జనాభా లెక్కల్లో సర్నా మతాన్ని అనుసరించే వారినికూడా చేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారన్నారు.

కొన్ని సంస్థలు ఏకరూప పౌర స్మృతి కోసం డిమాండ్ చేస్తున్నపుడు, గిరిజనులు-సర్నా కమ్యూనిటీ డిమాండ్‌పై సానుకూల చొరవ కూడా కచ్చితంగా అవసరమే. ఆదివాసీల జనాభాలో ఇటువంటి అనేక గ్రూపులు అంతరించి పోయే ముప్పును ఎదుర్కొంటున్నాయని మీకు తెలుసు, అటువంటపుడు సామాజిక న్యాయం సూత్రంపై వారిని రక్షించకపోతే ఇక వారి భాష, సంస్కృతి, అన్నీ కూడా అంతమైపోయే ప్రమాదముందని ఆ లేఖలో సోరెన్ ఆందోళన వ్యక్తం చేశారు.

**జాతీయ ఉత్తమ పర్యాటక గ్రామంగా లేపాక్షి**

**విద్యారంగ సమస్యలు పరిష్కరించండి**

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుచోట్ల ఆందోళనలు

**పంట రుణాల కోసం కౌలు రైతుల ఆందోళనలు**

లోపలి పేజీలో..

## కాశ్మీర్ ఆపరేషన్‌పై తప్పుడు ప్రచారం

- సోషల్ మీడియాను ఉపయోగించుకున్న ఆర్మీ
- అయినా చర్యలకు వెనకాడిన మెటా ఇండియా
- వాషింగ్టన్ పోస్ట్ కథనం

**వాషింగ్టన్ :** కాశ్మీర్‌లో సైన్యం నేతృత్వంలో ఏడాది పాటు సాగిన తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవడంలో మెటా భారత్ బృందం తీవ్ర అలసత్వం వహించిందని 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక తాజాగా వెల్లడించింది. కంపెనీలోని మాజీ ఉద్యోగులను ఉటంకిస్తూ ఈ విషయం తెలిపింది. భారత సైనికాధికారులు ట్విట్టర్, ఫేస్‌బుక్ ప్రతినిధులను కలుసుకుని, పాకిస్తాన్ సాగించే తప్పుడు సమాచారం నెట్‌వర్క్‌లకు ప్రతిగా తాము ఈ ఆపరేషన్‌ను చేపట్టినట్లు పేర్కొంటూ తమ చర్యను సమర్ధించుకున్నారని వాషింగ్టన్ పోస్ట్ తన వార్తా కథనంలో తెలిపింది. జమ్మూ కాశ్మీర్‌లోని భారత సైన్యం చినార్ కార్ప్స్ నేతృత్వంలో ఏడాది పాటు సైన్యం తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ప్రచారం చేశాయని, అయినా వాటిపై ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా భారత బృందం చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని ఆ వార్తా కథనం పేర్కొంది. జమ్మూకాశ్మీర్‌లో ఆర్మీకి చెందిన చినార్ కార్ప్స్ పెట్టిన పోస్టు కాశ్మీరీ జర్నలిస్టులను ప్రమాదంలో పడేసే తప్పుడు సమాచారమని ఆ నివేదిక పేర్కొంది.

ప్రపంచవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో కృత్రిమంగా సందేశాలను పంపేలా నకిలీ ప్రొఫైల్స్, ఖాతాల నెట్‌వర్క్‌ను ప్రారంభించారంటూ మెటాకి చెందిన కోఆర్డినేటెడ్ ఇన్ ఆథెంటిక్ బిహేవియర్ (సిఐబి) బృంద సభ్యులను ఆ నివేదిక ఉటంకించింది. ఆర్మీ అధికారులు ట్విట్టర్, ఫేస్‌బుక్ ప్రతినిధులను కలసి ఈ సైనిక చర్యను బలపరచాలని కోరినట్లు వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. చినార్ కార్ప్స్ చేపట్టిన ఆపరేషన్ గురించి ఫేస్‌బుక్‌కు చెందినకో-ఆర్డినేటెడ్ ఇనాథెంటిక్ బిహేవియర్ ( సిఐబి) సభ్యులు భారత్‌లోని మెటా సిబ్బందిని హెచ్చరించినట్లు ఆ నివేదిక తెలిపింది. "తన నియంత్రణలోని భూభాగంలో సార్వభౌమాధి కార ప్రభుత్వం తీసుకునే చర్యలను వ్యతిరేకించరాదు." అంటూ హెచ్చరించింది. పైగా స్థానిక ఉద్యోగులను దేశద్రోహ నేరం కింద జైల్లో పెట్టే ప్రమాదముందంటూ ఆందోళన వ్యక్తం చేసిందని వాషింగ్టన్ పోస్ట్ తన వార్తా కథనంలో పేర్కొంది. శ్రీనగర్ ప్రధానకేంద్రంగా పనిచేసే మీడియా సంస్థ ది కాశ్మీరియత్, దాని సంపాదకుడు క్వాజి షిబ్లిని లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ జరిగినట్లు తెలుస్తోంది.

అంతర్జాతీయంగా అన్ని దేశాల్లో విస్తరించి వున్న కంపెనీగా, తాము మరింత సంక్లిష్టమవుతున్న వాతావరణంలో పనిచేస్తున్నామని, అయినా, ఆయా ప్రాంతాల్లో వర్తించే చట్టాలు, మానవ హక్కుల నిబంధనలకు అనుగుణంగా వుండేలా తమ ఉద్యోగుల భద్రతకు హామీ కల్పిస్తూ తమ సేవలను ఉపయోగించుకునే వారి భద్రతపై కూడా దృష్టి పెడతామని మెటా ఒక ప్రకటనలో పేర్కొంది. తమ వేదికలపై సిఐబిని నిషేధించామని తెలిపింది.

సోషల్ మీడియా సంస్థ భారత్‌లో ఈ విధంగా తప్పుడు ప్రచార నెట్‌వర్కులను తమ వేదికలపై అనుమతించడం ఇదే మొదటిసారి కాదు. 2020 లోనూ ఇలానే జరిగింది. తెలంగాణ బిజెపి ఎమ్మెల్యే టి రాజాసింగ్ మయన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యా వలసవాసులను తరిమేయాలంటూ సోషల్ మీడియా వేదికగా విషం వెళ్లగక్కితే అప్పుడూ మెటా భారత బృందం చేష్టలుడిగినట్లు వ్యవహరించింది.

## ఉద్యోగుల పాలిట
# చీకటి రోజు

- యుటిఎఫ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఉద్యోగ, ఉపాధ్యాయ ఆకాంక్షలకు వ్యతిరేకంగా జిపిఎస్ బిల్లును ఆమోదించి వారి ఆశలను రాష్ట్ర ప్రభుత్వం చిదిమేసిందని యుటిఎఫ్ విమర్శించింది. ఉద్యోగులందరికీ చీకటి రోజు అని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిపిఎస్ వద్దని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్షంగా జిపిఎస్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిపిఎస్‌కు గ్యారెంటీ పెన్షన్ అని పేరు పెట్టడం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేయటమేనని ఆక్షేపించారు. ఏ రాష్ట్రంలో లేని కొత్త విధానం, దేశానికి ఆదర్శం అని ప్రభుత్వం చెబుతుందని పేర్కొన్నారు. కంట్రిబ్యూషన్ కట్టించుకునే విధానం ఆదర్శమెలా అవుతుందని ప్రశ్నించారు. భవిష్యత్‌లో జిపిఎస్ చట్టం రద్దు, పాత పెన్షన్ సాధించడం కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని, అందుకు తగిన ఉద్యమ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

జిపిఎస్ బిల్లు ఆమోదం సిపిఎస్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం అని డిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నరహరి, ఎన్‌వి రమణయ్య మరో ప్రకటనలో పేర్కొన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
**editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## పులివెందుల బస్టాండుకు టూరిజం అవార్డు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ యాన్యువల్ టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డ్స్-2023 అవార్డును పులివెందుల బస్టాండు వైఎస్ఆర్ బస్ టెర్మినల్‌కు ఇచ్చారు. ఈ మేరకు బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం కార్యక్రమంలో బెస్ట్ టూరిస్ట్ ఫ్రెండ్లీ బస్టాండు అవార్డును అందజేశారు. పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా చేతులమీదుగా పులివెందుల ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎస్ రామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోతురాజులు ఈ అవార్డును అందుకున్నారు. పులివెందులలో పారిశుధ్యం, ప్రయాణికుల కోసం డార్మెట్రి, ప్రీపెయిడ్ ఆటో, వికలాంగులకు, మహిళలకు, విద్యార్థులకు ప్రత్యేక వసతులు, లగేజ్ కౌంటర్లు వంటి సేవలకు గానూ పర్యాటకశాఖ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. పులివెందుల బస్ టెర్మినల్‌కు టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డు రావడం పట్ల డిపో మేనేజర్‌ను, ఇతర సిబ్బందిని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు అభినందించారు.

## అభ్యంతరాలను ఎపి పట్టించుకోవడంలేదు

- సిడబ్ల్యుసికి తెలంగాణ లేఖ

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

పోలవరం బ్యాక్ వాటర్ విషయంలో తమ అభ్యంతరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ కేంద్ర జల సంఘానికి (సిడబ్ల్యుసి) తెలంగాణ సాగునీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి ఇంజినీర్ ఇన్ చీఫ్ సి మురళీధర్ బుధవారం లేఖ రాశారు. పోలవరం బ్యాక్ వాటర్ మూలంగా తెలంగాణలో 954 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. తొమ్మిది అంశాల్లో ఒక్కదానిపైనా ఆంధ్రప్రదేశ్ చర్యలు తీసుకోలేదని లేఖలో పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ) నుంచి సమన్వయం లోపం ఉందని తెలిపారు. ఈ సంగతిని సుప్రీంకోర్టులో కేంద్రం నివేదించినట్టు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. సిడబ్ల్యుసి, పిపిఎ భేటీల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో తక్షణమే చర్యలు చేపట్టాలని సిడబ్ల్యుసికి విజ్ఞప్తి చేశారు.

## లోయలో పడిన బైక్

- ముగ్గురు యువకులు దుర్మరణం

**ప్రజాశక్తి-మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)**

ఒడిశా ఘాట్‌రోడ్డు లోయలో పడి పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం అనసభద్ర గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మరణించారు. ఒడిశా పోలీసుల వివరాల మేరకు.. దబ్బగడ్డగడ్డ పంచాయతీ అనసభద్ర గ్రామానికి చెందిన జన్ని బాలరాజు (21), మర్రి జయరాజు (22), మర్రి శివ (23) కలిసి బుధవారం ఉదయం ద్విచక్రవాహనంపై ఒడిశా ప్రాంతానికి పనికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నారాయణ పట్నం బ్లాక్ పరిధిలోని కేసలి సంత ఘాట్‌రోడ్డులో వారి వాహనం అదుపు తప్పి లోయలో పడిపోయింది. దీంతో ముగ్గురు యువకులు మరణించారు. ద్విచక్రవాహనం సైడ్ స్టాండ్ తీయకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. బాలరాజు వలంటీర్‌గా పనిచేస్తున్నారు. మిగతా ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒడిశా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

- **బిల్లుకు ఆమోదం తెలిపిన అసెంబ్లీ**

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చట్టం-2023 బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. దీన్ని ఆర్థిక, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వంలోని 177 శాఖల్లో 2014 జూన్ రెండో తేదీనాటికి చేరిన 10,117 మంది రెగ్యులరైజ్ అవ్వనున్నారు. క్రమబద్ధీకరణ వల్ల ప్రభుత్వంపై ఏడాదికి రూ.311 కోట్ల అదనపు భారం పడుతుందని మంత్రి పేర్కొన్నారు. పూర్తిగా కాంట్రాక్టు ప్రాతిపదికన చేరినవారిని మాత్రమే ఈ చట్టం ప్రకారం రెగ్యులరైజ్ చేయనున్నట్లు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశామని వివరించారు. అటానమస్ బాడీలో ఉండి పనిచేస్తున్న 14,650 మంది వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో చేర్చి రెగ్యులరేజ్ చేశామని తెలిపారు. అలాగే ఆశావర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకూ జీతాలు పెంచామని వివరించారు. మెప్మా సిబ్బంది, హోంగార్డులు, అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు పెంచామని అన్నారు.

**సిఎంకు ధన్యవాదాలు : ఎపిఎన్‌జిఒ**

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి అసెంబ్లీలో బిల్లును ఆమోదించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కెవి శివారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మాటను జగన్ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు.

## ఆంక్షలతో రెగ్యులరైజేషనా? : మండలిలో పిడిఎఫ్ ప్రశ్న

అంతకు ముందు కాంట్రాక్టు ఉద్యోల క్రమబద్ధీకరణ బిల్లుపై మండలిలో జరిగిన చర్చలో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి షరతులు లేకుండా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీ పూర్తిగా అమలుకు నోచుకోవడం లేదన్నారు. పలు ఆంక్షలతో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. 2019కి ముందు పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్న నిబంధన పాటించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు కూడా పెంచాలన్నారు. షేక్ షాబ్జి మాట్లాడుతూ ఐదేళ్ల కాలపరిమితిని పరిగణలోకి తీసుకుని రెగ్యులర్ చేయాలన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తేదీ 2014 జూన్ 2వ తేదీకి ముందు పనిచేస్తున్న వారందరినీ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రెగ్యులర్ చేసేందుకు కసరత్తు చేసినట్లు చెప్పారు. సంబంధిత ఉద్యోగులు పనిచేస్తున్న పోస్టుల్లో రిజర్వేషన్లు, అవసరమైన విద్యార్హత, వయస్సు, పోస్టు ఆర్థిక శాఖ అనుమతితో శాంక్షన్ అయి ఉండటం, శాశ్వత ప్రాతిపదికన పోస్టు ఖాళీగా ఉండటం తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉందని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయని వీటిని ప్రమాణికంగా తీసుకుని జాబితా సిద్ధం చేశామని తెలిపారు. ఈ జాబితా ప్రకారం మొత్తం ఉద్యోగుల్లో 10,117 మంది అర్హులుగా నిర్ధారణ అయ్యారని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంపై ఎమ్మెల్సీలు కల్పలత, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

## ముఖ్యమంత్రి ప్రసంగం లేకుండానే
# అసెంబ్లీ నిరవధిక వాయిదా

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఐదురోజుల పాటు జరిగిన ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. శాసనసభలో ఈసారి సిఎం జగన్ ఒక్కసారి కూడా ప్రసంగించకుండానే సమావేశాలు ముగిశాయి. ప్రతిపక్ష టిడిపి సభ్యులు మొదటి రెండు రోజులు చంద్రబాబు అరెస్టుపై చర్చకు పట్టుబట్టి సస్పెన్షన్‌కు గురయ్యారు. తరువాత మూడు రోజులు వారు సభను బహిష్కరించి మాక్ అసెంబ్లీ ద్వారా టిడిపి కార్యాలయంలోనే తమ వాదన వినిపించుకున్నారు. ఉభయ సభల్లో అధికార పార్టీ సభ్యులు చంద్రబాబుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సిఎం జగన్‌ను పొగడ్తలతో ముంచెత్తి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భక్తిని చాటుకున్నారు. సిఎం జగన్ ఈ అంశంపైనా చర్చలో పాల్గొనలేదు. స్వల్పకాలిక చర్చల్లో కూడా మాట్లాడకుండా మంత్రులతోనే మాట్లాడించారు. ఉభయ సభలో మొత్తం 18 బిల్లులు ఆమోదించారు. ఈసారి ఎటువంటి నివేదికలు సమర్పించలేదు. సభ జరిగినన్ని రోజులు ప్రశ్నోత్తరాలు దాదాపుగా పూర్తిస్థాయిలో జరిగాయి. మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పలు ప్రజా సమస్యలపై తమ వాదన బలంగా వినిపించారు. బుధవారం సాయంత్రం మండలిలో ప్రవేశపెట్టిన జిపిఎస్ బిల్లుపై పిడిఎఫ్ సభ్యులు తమ నిరసన, వ్యతిరేకత తెలియజేస్తూ సిపిఎస్ రద్దు విషయంలో సిఎం జగన్ మాట తప్పారని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సార్వత్రిక ఎన్నికలకు మరికొద్దినెలల సమయం ఉండటంతో ఈ టర్మ్‌కు ఇదే దాదాపుగా చివరి సమావేశాలుగా భావించిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల నుంచి తమ అనుచరులతో సహా తరలివచ్చారు. మళ్లీ డిసెంబరులో శీతాకాల సమావేశాలు జరగవచ్చునని లేదా ఫిబ్రవరిలో కొద్ది రోజులు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు జరగవచ్చునని సమాచారం.

రాచపాళెంను సన్మానిస్తున్న బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మణరావు, మాణిక్యవరప్రసాద్ తదితరులు

## లఘుచర్చలకు మంత్రుల విముఖత

- జ్వరం వల్ల మండలికి ఆరోగ్యశాఖ మంత్రి గైర్హాజరు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

శాసనమండలిలో విద్య, వైద్యరంగాలపై బుధవారం జరగాల్సిన లఘు చర్చకు మంత్రులు విముఖత తెలపడంతో ఈ అంశాలపై చర్చలు లేకుండా సభ నిరవధికంగా వాయిదా పడింది. విద్యా రంగంలో మార్పులు, సంస్కరణలు, వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులపై లఘు చర్చ జరుగుతుందని అజెండాలో పేర్కొన్నా.. సాయంత్రం వరకు చర్చ జరగలేదు. చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, విప్ జంగా కృష్ణమూర్తి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆసక్తి చూపలేదు. తాను మంగళవారం మండలిలో విద్యాశాఖపై ఐదు ప్రశ్నలకు చర్చలో అన్ని అంశాలూ చెప్పానని ఇంకా చెబుతామని నిరాసక్తత వ్యక్తం చేశారు. అలాగే మంత్రి రజిని తనకు జ్వరంగా ఉండటం వల్ల చర్చలో పాల్గొనలేనని విముఖత తెలిపారు. దీంతో ఈ రెండు అంశాలపై చర్చ జరగలేదు. కేవలం స్కిల్ డెవలప్‌మెంట్‌పైనే చర్చ జరిగింది. ఐదు రోజుల్లో మండలిలో 18 బిల్లులకు ఆమోదం తెలపగా, వ్యవసాయం, సిల్క్ డెవలప్‌మెంట్ రంగాలపై స్వల్పకాలిక చర్చలు జరిగాయి. మొత్తం ప్రత్యేక ప్రస్తావన ద్వారా 36 అంశాలను సభ్యులు ప్రస్తావించారు. వీరికి జవాబులు సంబంధిత శాఖ అధికారులు తరువాత పంపిస్తారని ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తెలిపారు. మొత్తం ఐదు రోజుల్లో 17 గంటల 12 నిమిషాలపాటు సభ జరిగిందని 18 బిల్లులు ఆమోదం పొందాయని పేర్కొన్నారు.

# విద్యలో సంస్కరణలు తెచ్చాం

- మంత్రి బొత్స సత్యనారాయణ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పాఠశాల, ఉన్నత విద్యలో నాణ్యతను పెంచేందుకు ఎన్నో సంస్కరణలు చేపట్టామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. బుధవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు ఎం జగన్‌మోహన్‌రావు, ఎన్ ధనలక్ష్మి, జి శ్రీనివాసనాయుడు, కె అనిల్‌కుమార్, కిలారి వెంకట రోశయ్య విద్యారంగంపై అడిగిన ప్రశ్నలకు బొత్స సత్యనారాయణ సమాధానమిచ్చారు. ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని, మూడో తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్లను పెట్టామని తెలిపారు. గతంలో విద్య అంటే కేరళ రాష్ట్రం గురించి చెప్పేవారని, ఇప్పుడు దేశం దృష్టి ఆంధ్రప్రదేశ్‌పై పడిందన్నారు. ఉపాధి కల్పించే కోర్సులతో డిగ్రీ చదువులను తయారు చేశామన్నారు.

**అందరూ మెచ్చేలా అంబేద్కర్ విగ్రహం : మేరుగ**

విజయవాడ నగరం నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహాన్ని అందరరూ మెచ్చేలా జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఎమ్మెల్యేలు వి వరప్రసాదరావు, టిజెఆర్ సుధాకర్, జొన్నలగడ్డ పద్మావతి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహం నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు.

**కౌలురైతులకు రైతుభరోసా ఇస్తున్నాం : మంత్రి కాకాని**

రాష్ట్రంలో కౌలురైతులకు కేంద్ర ప్రభుత్వం పిఎం

కిసాన్ పథకాన్ని ఇవ్వకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కింద రూ.13,500లను ఇస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, అబ్బయ్యచౌదరి, పి శ్రీనివాసరావు, ఎ శివకుమార్ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. సిసిఆర్ కార్డులతో కౌలురైతులకు పంటపై హక్కులు వుంటాయన్నారు. రాష్ట్రంలో 25,66,147 కార్డులను కౌలురైతులకు అందించామని తెలిపారు. 5,38,227 మంది కౌలురైతులకు రైతుభరోసాను అందిస్తున్నామన్నారు. 2,41,453 మందికి ఇన్‌పుట్ సబ్సిడీ, 3,54,878 మందికి ఉచిత పంటల బీమా, 36,760 మందికి సున్నా వడ్డీని అమలు చేసినట్లు పేర్కొన్నారు.

కాగా మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.23,167 కోట్లు ఖర్చు చేసినట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎస్‌బి అంజాద్ బాషా తెలిపారు. ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, ముస్తాఫాషేక్, వవాజ్ బాషా, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి చెప్పారు. మైనార్టీల కోసం ఇమామ్‌లకు, మౌజమ్‌లకు, పాస్టర్‌లకు గౌరవ వేతనాలు ఇస్తున్నామని తెలిపారు.

## స్వచ్ఛమైన కవి గుర్రం జాషువా

- జయంతి సభలో వక్తలు
- రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డికి జాషువా పురస్కారం

**ప్రజాశక్తి-గుంటూరు**

గుర్రం జాషువా సాహిత్యతత్వం ప్రకారం సామాజిక న్యాయం కేవలం అస్పృశ్యులకు సంబంధించిన అంశం కాదని, అది ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా అన్ని పార్శ్వాలూ కలిగి ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. జాషువా స్వచ్ఛమైన కవి అని కొనియాడారు. గుర్రం జాషువా 128వ జయంతిని పురస్కరించుకొని గుంటూరు బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో సభ నిర్వహించారు. ఈ ఏడాది జాషువా కవితా పురస్కారాన్ని రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డికి పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పాశం రామారావు ప్రదానం చేశారు. 'జాషువా సాహిత్యం-సామాజిక న్యాయం' అనే అంశంపై చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మన్యూనతతో బతుకుతున్న వారికి జాషువా సాహిత్యం ఆత్మవిశ్వాసం కల్పిస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జాషువా, గురజాడ వంటి వారి అవసరం ఎంతో ఉందని వివరించారు. విఠపు బాలసుబ్రమ్మణ్యం మాట్లాడుతూ.. నేటి పరిస్థితుల్లో జాషువా సాహిత్యాన్ని గుర్తు చేసుకొని సాంస్కృతిక కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జాషువా విజ్ఞాన కేంద్రం సెక్రటరీ కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో జరిగిన సభలో మాట్లాడుతున్న గఫూర్

## ఉక్కు రక్షణ యాత్ర @1200 కి.మీ

**ప్రజాశక్తి - యంత్రాంగం**

రానున్న ఎన్నికల్లో విశాఖ ఉక్కు పరిరక్షణ అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చని పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. ఈ నెల 20న సిపిఎం ఆధ్వర్యాన విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఉక్కు రక్షణ బైకు యాత్ర అనకాపల్లి జిల్లాలో ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. ఎనిమిదో రోజూ ప్రజలను చైతన్య పరుస్తూ ఈ యాత్ర 1200 కిలోమీటర్ల మైలురాయిని చేరుకుంది. బుధవారం నక్కపల్లి, అడ్డురోడ్, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, అనకాపల్లి, లంకెలపాలెం మీదుగా విశాఖపట్నం జిల్లాలోని అగనంపూడి, స్టీల్ టౌన్‌షిప్‌లో సాగింది. ఎక్కడికక్కడ ప్రజలు యాత్రా బృందానికి ఘన స్వాగతం పలికారు. పలుచోట్ల జరిగిన సభల్లో గఫూర్ మాట్లాడుతూ ప్రజా మద్దతుతో స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుంటామని ఉద్ఘాటించారు. త్యాగాలతో ఏర్పడి, కార్మికుల శ్రమతో రూ.3 లక్షల కోట్ల విలువకు చేరిన స్టీల్‌ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం అప్పనంగా అదానీ వంటి కార్పొరేట్లకు కారుచౌకగా తెగనమ్మాలని చూడడం దారుణమన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు మోడీ భజన చేస్తున్నాయే తప్ప రాష్ట్ర ప్రయోజనాలపై ప్రశ్నించడం లేదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఉక్కు రక్షణ యాత్రలో సిపిఎం నాయకులు బి.జగన్, ఆర్.శంకరరావు, ఎం.అప్పలరాజు, కర్రి అప్పారావు, జి.దేముడు నాయుడు, వివి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ 'వర్సిటీ' మెడికల్ కౌన్సెలింగ్‌లో అక్రమాలు

- విచారణ జరిపించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వైఎస్ఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం రెండో విడత ఎంబిబిఎస్ కౌన్సెలింగ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తెలిపారు. వైద్యకళాశాలల ఏర్పాటుపై వైసిపి సభ్యులు తోట త్రిమూర్తులు, దువ్వాడ శ్రీనివాస్, మొండితోక అరుణ్‌కుమార్ శాసనమండలిలో వైద్యారోగ్యశాఖ మంత్రిని బుధవారం ప్రశ్నించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ఎస్‌సి, బిసి కేటగిరి సీట్లను కౌన్సెలింగ్‌లో భర్తీ చేయాలని చెప్పారు. అయితే ముందు ఓపెన్ కేటగిరి సీట్లను భర్తీ చేసిన తరువాత ఎస్‌సి, బిసి కేటగిరి సీట్లు భర్తీ చేశారని తెలిపారు. విశ్వవిద్యాలయం ఉపకులపతితో చర్చించి ఈ విధానాన్ని పున:సమీక్షించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. వైద్య కళాశాలల్లోని సీట్లను అమ్ముకోవడం సరికాదని అన్నారు. మెడికల్ సీట్ల కౌన్సెలింగ్‌పై వైద్యారోగ్యశాఖ మంత్రి రజిని నేరుగా సమాధానం చెప్పకుండా టిడిపి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. టిడిపి ప్రభుత్వం వైద్యకళాశాల ఏర్పాటు కోసం అసలు చర్యలు తీసుకోలేదన్నారు. మెడికల్ సీట్ల కౌన్సెలింగ్‌లో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. కళాశాల నిర్వహణ కోసం ఫీజులను ప్రవేశపెట్టామన్నారు.

**ఆర్‌టిసి స్థలాలను ప్రైవేటుకు అప్పగించొద్దు**

ఆర్‌టిసి స్థలాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ప్రజా రవాణా సంస్థ (ఆర్‌టిసి) భూముల లీజు, కొత్త బస్సుల కొనుగోలు అంశాలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఐ వెంకటేశ్వరరావు, కెఎస్ లక్ష్మణరావు, షేక్ సాబ్జీ రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ప్రశ్నించారు. రాష్ట్రంలో 25 చోట్ల 22.68 ఎకరాలను వివిధ సంస్థలకు లీజుకు ఇచ్చిందని మంత్రి సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. గ్రామాల్లో బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అద్దె బస్సుల డ్రైవర్లకు పిఎఫ్, ఇఎస్ఐ అమలయ్యే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని సూచించారు. అద్దె బస్సులు తగ్గించి ప్రభుత్వం సొంత బస్సులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌టిసి పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న సిబ్బందిని కాంట్రాక్టు విధానంలో తీసుకురావాలని చెప్పారు. 30 నుంచి 50 ఏళ్లపాటు స్థలాలను లీజుకు అప్పగించడం సరికాదని కెఎస్ లక్ష్మణరావు అభ్యంతరం వ్యక్తం చేశారు.

**కందిపప్పు ఇవ్వడంలేదు : వైసిపి ఎమ్మెల్సీ అరుణ్**

తెల్లరేషన్ కార్డుదారులకు నాలుగు నెలలు నుంచి కందిపప్పు సక్రమంగా అందించడం లేదని వైసిపి ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండియు వాహనాలు అందించే రేషన్ కోసం కూలి పనులు మానుకుని వేచిచూడాల్సి వస్తోందని వైసిపి ఎమ్మెల్సీ జయమంగళం వెంకటరమణ అన్నారు. వాహనాలు కూడా ఇంటింటికీ వెళ్లడం లేదని చెప్పారు. ప్రజల్లో ప్లాస్టిక్ బియ్యంపై ఉన్న అపోహలను తొలగించాలని కోరారు.

**రోడ్ల మరమ్మతులపై పిడిఎఫ్ వాయిదా తీర్మానం**

రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న రహదారుల గురించి చర్చించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు బుధవారం మండలిలో ఛైర్మన్ కె మోషేను రాజుకు వాయిదా తీర్మానం అందించారు. ఈ తీర్మానాన్ని ఛైర్మన్ తిరస్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. మంగళవారం తను విజయవాడ నుంచి రామచంద్రాపురం వెళ్లానని, మండపేట, రామచంద్రాపురం ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల పరిస్థితి ఇలానే ఉందని చెప్పారు.

# అసైన్డ్ చట్టానికి తూట్లు

- ఇన్నర్ రింగ్ రోడ్డు అవినీతిపై చర్చలో మంత్రులు ధర్మాన, ఆదిమూలపు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

అమరావతి రాజధాని ప్రాంతంలోని అసైన్డ్ చట్టానికి తూట్లు పొడిచి, ఆ భూముల రికార్డులను మాయం చేసి, పేదలను బెదిరించి చంద్రబాబు నాయుడు అండ్‌కో భూములను లాక్కున్నారని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆరోపించారు. పిఒటి యాక్ట్‌కు వ్యతిరేకంగా మున్సిపల్ శాఖ నుంచి జిఓ 41ని తీసుకొచ్చారన్నారు. సిఆర్‌డిఎ-ఇన్నర్ రింగ్ రోడ్డులో అవినీతి అనే అంశంపై బుధవారం శాసనసభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో అభివృద్ధి ఫలాలను తన వాళ్లకే దక్కేలా చేశారని, అదే తరహాలో అమరావతిలోనూ చేయాలని చంద్రబాబు ప్లాన్ చేశారన్నారు. మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. అమరావతి గ్రాఫిక్స్‌తో చంద్రబాబు గారడీ చేశారని, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఇష్టం వచ్చినట్లు మార్చుకున్నారన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు స్కామ్‌కు

ధర్మాన　　ఆదిమూలపు

చంద్రబాబు డైరెక్షన్ వహించగా, లోకేష్ పర్యవేక్షించారని ఆరోపించారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మొత్తం లింగమనేని, హెరిటేజ్ భూముల పక్క నుంచి వెళ్లేలా మార్చినందుకు క్విడ్ ప్రోకో కింద చంద్రబాబుకు కరకట్ట గెస్ట్ హౌస్‌ను ఇచ్చారని పేర్కొన్నారు. ఇదే అంశంపై మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ.. రాజధానిపై చంద్రబాబు రోజుకో డ్రామా నడిపారని, దోపిడీ దొంగలు రెక్కీ చేసినట్లుగా రింగ్‌రోడ్డు స్కామ్ జరిగిందన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఇన్నర్ రింగ్ రాబోతున్న ప్రాంతంలో ఎకరం ఆరేడు లక్షలు మాత్రమే ధర ఉండేదని, ఆయా భూములను పేదల వద్ద తక్కువ ధరకు కొని, అదే భూములను ప్రభుత్వానికి ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చి రూ.కోట్లు సంపాదించుకున్నారన్నారు.

## రూ.50 కోట్లతో రహదారి భద్రతా నిధి : సిఎస్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో రహదారి భద్రతకు సంబంధించి రూ.50 కోట్ల రివాల్వింగ్ ఫండ్ నిధులతో ప్రత్యేకంగా రహదారి భద్రతా నిధిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రహదారి భద్రత, డ్రాఫ్ట్ ఆడిట్ నివేదిక అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న రహదారి ప్రమాదాల వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడిపే వారిపై నూతన మోటారు వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనాల అధిక వేగ నియంత్రణకు స్పీడ్ గన్స్‌ను అందుబాటులో ఉంచాలని చెప్పారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్టు వినియోగంపై అవగాహన కల్పించాలని పోలీసు, రవాణాశాఖ అధికారులను ఆదేశించారు.

## కార్యరూపం దాల్చని ప్రాజెక్టుపై కట్టుకథలు

- రింగ్‌రోడ్డుపై ఏమీ ఖర్చు చేయలేదు
- టిడిపి మాక్ అసెంబ్లీలో విమర్శలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కార్యరూపం దాల్చని ప్రాజెక్టుపై జగన్ ప్రభుత్వం కట్టుకథలు అల్లుతోందని టిడిపి విమర్శించింది. అసలు వేయని రోడ్డులో రూ.2,400 కోట్ల లబ్ధి జరిగిందనడం రాజకీయ కుట్రలో భాగంగా చేస్తున్న దుష్ప్రచారం అని పేర్కొంది. టిడిపి కార్యాలయంలో బుధవారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టుపై ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ వివరించారు. శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అమరావతిని రాజధానిగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటిస్తే.. ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్ స్వాగతించారని తెలిపారు. అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్డు ఆలోచన ప్రభుత్వం చేసి చర్చించిందన్నారు. సింగపూర్‌కు చెందిన సుర్బానా జూరాంగ్ తయారుచేసిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం స్టుప్ కన్సల్టెంట్ సంస్థ తయారుచేసిందన్నారు. 75 మీటర్ల వెడల్పుతో 96.25 కిలోమీటర్ల మేరకు అమరావతిలో 27 రోడ్లను కలుపుతూ 87.19 కిలోమీటర్ల రోడ్డును ప్రతిపాదించిందన్నారు. 41 గ్రామాల్లో ఏయే సర్వే నెంబర్ల నుంచి రోడ్డు వెళ్తుందో బహిరంగంగా ప్రచురించారని పేర్కొన్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ఒక్క ఎకరా భూమి కూడా సేకరించలేదని సిఆర్‌డిఎ 2023 మేలో సమాచార హక్కు చట్టం కింద సమాచారం ఇచ్చిందన్నారు. 2018 సెప్టెంబరులో నోటిఫికేషన్ ఇవ్వడంతోనే ఆగిపోయిందన్నారు. చంద్రబాబును ఎలాగైనా జైల్లోనే ఉంచాలని అవినీతి జరగని వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. కాగితాల్లో తప్ప కనిపించని ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో పెద్ద కుంభకోణం జరిగిందని, రూ.2,400 కోట్లు అక్రమంగా లబ్ధి పొందారని ఎసిబి కోర్టులో సిఐడి మెమో దాఖలు చేసిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్, నాయకులు గద్దె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మరో బెంచ్‌కు స్కిల్ స్కాంపై పిల్

**ప్రజాశక్తి-అమరావతి**

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం దర్యాప్తును సిబిఐకి బదిలీ చేయాలంటూ రాజమండ్రి మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన పిల్‌ను మరో బెంచ్‌కు నివేదించాలని హైకోర్టు రిజిస్ట్రీకి చీఫ్ జస్టిస్ బెంచ్ బుధవారం ఆదేశించింది. తమలో ఒకరు సభ్యులుగా లేని బెంచ్‌కు పిల్‌ను నివేదిచాలంది. మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి అచ్చెన్నాయుడు వంటి వాళ్లు నిందితులుగా ఉన్న ఈ స్కాంపై సిబిఐ విచారణకు ఆదేశించాలన్న పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. విచారణ చేసేందుకు జస్టిస్ రఘునందన్‌రావు నిరాకరించారు. దీంతో మరో ధర్మాసనం ముందు ఈ వ్యాజ్యాన్ని ఉంచాలని రిజిస్ట్రీని బెంచ్ ఆదేశించింది. ఎప్పుడు విచారణ జరిగేదీ తేలాల్సి వుంది.

**టిడిపి నేతలకు నోటీసులు**

కాగా హైకోర్టు న్యాయమూర్తులు, ఎసిబి కోర్టు జడ్జిలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అనుచిత పోస్టింగ్స్ పెట్టిన టిడిపి నేతలు, ఇతరులు మొత్తం 27 మందికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అందుకు బాధ్యులైన వాళ్ల సోషల్ మీడియా అకౌంట్ల అసలు యజమానులను గుర్తించి నోటీసులు ఇవ్వాలని డిజిపిని ఆదేశించింది.

**ముందస్తు బెయిల్ ఇవ్వండి : లోకేష్**

అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ డిజైన్ల మార్పుల పేరుతో అక్రమాలు చోటుచేసుకున్నాయనే కేసులో సిఐడి తనను నిందితుడిగా చేర్చడాన్ని సవాల్ చేస్తూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో తన పాత్ర లేదని, తనకు ముందుస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు విచారణ చేయనుంది.

## టిటిడి ఇఒ నివాసం వద్ద చిరుత సంచారం

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

తిరుమల శ్రీవారి మెట్టు నడకదారిలోని టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి నివాసం వద్ద చిరుత సంచారం కలకలం సృష్టించింది. ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో బుధవారం తెల్లవారుజామున ఈ దృశ్యం కనిపించింది. అప్రమత్తమైన ఫారెస్టు అధికారులు చిరుతను బంధించేందుకు బోన్లను ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్ చిరుత ద్వారా అలిపిరి నడకమార్గం లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద ఆరు చిరుత పులులు చిక్కాయి.

**రేపు వస్త్రాల వేలం**

శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు.. సందర్శకులు కానుకగా సమర్పించిన వస్త్రాలను శుక్రవారం టెండర్ కమ్ వేలం వేయనున్నట్లు టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. వేలానికి కొత్తవి/ఉపయోగించిన/ పాక్షికంగా దెబ్బతిన్న వస్త్రాలు 14 లాట్లు ఉన్నాయి.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

## ఎకో పార్కు ప్రారంభం

**ప్రజాశక్తి - మంగళగిరి**

ఆహ్లాదకరమైన వాతావరణం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పట్టణానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాలను నగర వనాలుగా తీర్చిదిద్దుతామని అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణ పరిధిలోని ఎయిమ్స్ సమీపంలో 50 ఎకరాల విస్తీర్ణంలో అటవీ శాఖ నిర్మించిన నూతన ఎకో పార్కును ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి నగర వనాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆరు నెలల్లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని టిడిపి నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై విలేకరుల ప్రశ్నించగా చంద్రబాబు కుప్పంలో గెలిచిన తర్వాత మాట్లాడతానని బదులిచ్చారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలూ తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణ రెడ్డి, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుచోట్ల ఆందోళనలు

**ప్రజాశక్తి-యంత్రాంగం**

విద్యారంగ సమస్యలతోపాటు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం పలు జిల్లాల్లో ఆందోళన కొనసాగించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న చేపట్టిన 'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కర్నూలులో కలెక్టరేట్‌ను ముట్టడించారు. విద్యారంగ వినాశకర 77, 108, 108 జిఒలను రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి కరువు స్కాలర్‌షిప్ కింద ప్రతి విద్యార్థికి రూ.10 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు గేట్లు ఎక్కి కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు విద్యార్థులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. డిఆర్ఒ మధుసూదన్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధుల నుండి వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

స్పందిస్తూ జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో ఇచ్చిన హామీలు మాటలకే తప్ప అమలుకు నోచుకోలేదని తెలిపారు. విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి పథకాలలో ఎందుకు కోతలు విధించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి విద్యార్థులంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. సోమేశ్వరరావు, షేక్. జాహీదా తదితరులు పాల్గొన్నారు.

### మనువాద భావజాలంతో

## మహిళలపై పెరుగుతున్న దాడులు

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి
- మోడీ హఠావో, మహిళా బచావో, దేశ్ బచావో పోస్టరు ఆవిష్కరణ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

మనువాద భావజాలంతో దేశంలో చిన్నారులు, మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, హత్యలు, అత్యాచారాలకు అంతే లేదని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ హఠావో, మహిళా బచావో, దేశ్ బచావో పేరుతో ఐద్వా రూపొందించిన పోస్టరును బుధవారం వడ్డేశ్వరంలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. నేరాలు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డాగా ఆంధ్రప్రదేశ్ మారిందని, మహిళలు, చిన్నారులపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయని అన్నారు. తక్షణమే జస్టిస్ వర్మా కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ విచారణలు చేయాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ మాటలు నీటిపై రాతలుగా మిగిలిపోయాయని పేర్కొన్నారు. 42 శాతం నిరుద్యోగం పెరిగిందని, ఉపాధి లేక వలసలూ పెరిగాయని తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేసే మహిళలకు పని భద్రత లేదని, కనీస వేతనం అమలుకావడం లేదని, ఆహార భద్రత అటకెక్కిందని, ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. మోడీ అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర రూ.450 ఉంటే, ప్రస్తుతం రూ.1100 అయ్యిందని, ఎన్నికలు సమీపిస్తుండటంతో రూ.200 తగ్గించినట్లు మోసం చేస్తున్నారని తెలిపారు. మహిళల కోసం బడ్జెట్ కేటాయింపుల్లో 4.9 శాతం మాత్రమే ఇచ్చారని విమర్శించారు. లక్షల కోట్లు అదానీ, అంబానీలకు ఇస్తున్నారని, మహిళలకు ఇవ్వడం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి ఐద్వా ఆధ్వర్యాన చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, నాయకులు డి శ్రీనివాసకుమారి, జి అమలశ్రీ, టి శ్రీదేవి పాల్గొన్నారు.

## డిఎస్‌సి-98 అభ్యర్థులకు న్యాయం చేయాలి

- బొత్స కార్యాలయం వద్ద కెవిపిఎస్ ఆందోళన

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

డిఎస్‌సి-98 క్వాలిఫైడ్ అభ్యర్థులు 2,326 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి కోరారు. అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం ఉదయం విజయవాడలోని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కార్యాలయం ముందు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మాల్యాద్రి మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల చివరి రోజన్నా డిఎస్‌సిపై ప్రకటన చేయాలని కోరారు. దళిత, గిరిజన బలహీనవర్గాల వికలాంగులు, మహిళలకు అన్యాయం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌సి-98 సాధన కమిటీ నాయకులు శ్రీనివాసులు, జి మోహన్‌రావు, పి రమణ, పి రమేష్, సుహాసిని, కోమలి, చిన్ని కృష్ణయ్య పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న సర్పంచ్ ఆదినారాయణ

## జాతీయ ఉత్తమ పర్యాటక గ్రామంగా లేపాక్షి

**ప్రజాశక్తి-లేపాక్షి**

ఉత్తమ జాతీయ పర్యాటక గ్రామంగా శ్రీ సత్యసాయి జిల్లాలోని ప్రసిద్ధ శిల్పకళాక్షేత్రం లేపాక్షి ఎంపిక అయింది. ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పర్యాటక శాఖ నుంచి లేపాక్షి సర్పంచ్ ఆదినారాయణ బుధవారం అవార్డు అందుకున్నారు. లేపాక్షికి జాతీయ స్థాయి గుర్తింపు రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లేపాక్షిని మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని, పర్యాటకుల కోసం స్థానికంగా అన్ని సదుపాయలు కల్పిస్తామని సర్పంచ్ తెలిపారు. అవార్డు రావడంలో కృషి చేసిన రాష్ట్ర పర్యాటక శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆధారాలు లేకుండా ఎలా అరెస్టు చేస్తారు?

- టిడిపి రిలే దీక్ష శిబిరంలో నారా భువనేశ్వరి
- చంద్రబాబుకు మద్దతుగా మహిళల నిరాహారదీక్ష

**ప్రజాశక్తి - సీతానగరం(తూర్పుగోదావరి జిల్లా)**

నిరాహార దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న భువనేశ్వరి

నిరంతరం ప్రజల కోసం ఆలోచించే మనిషిని జైలులో పెట్టారని టిడిపి అధినేత నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ఏలాంటి ఆధారాలు లేకుండా ఎలా అరెస్టు చేస్తారు? ఆరోపణల్లో నిజాలు తెలుసుకోరా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం జివికె కన్వెన్షన్ వద్ద బుధవారం మహిళలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరానికి భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబును అరెస్టు చేసిన తీరు చాలా బాధాకరమన్నారు. ఏ తప్పు చేయకున్నా 19 రోజులుగా అన్యాయంగా జైలులో నిర్బంధించారని తెలిపారు. ప్రజల సొమ్ము దోచుకుని దాచుకునే అలవాటు చంద్రబాబుకు లేదన్నారు. రూ.300 కోట్లు, రూ.400 కోట్లు అని చెప్తున్నారని, ఆ డబ్బులు ఎక్కడికిపోయాయని పోలీసులు, సిఐడి అధికారులు నేటికీ నిర్ధారణ చేయలేకపోయారని విమర్శించారు. శాంతియుతంగా నిరసనలు తెలిపినా కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి రాజానగరం ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ.. అరెస్టులకు భయపడకుండా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తూ చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చియ్యచౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, బొడ్డు భాస్కరరావు సతీమణి జగన్మోహిని, అమరావతి జెఏసి కొలికిపూడి శ్రీనివాసరావు, టిడిపి తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి జవహర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్జిత సెలవుల బకాయిలు చెల్లించాలి

- ఎన్ఎంయు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఎపిఎస్ఆర్‌టిసి ఉద్యోగులకు 2020 నుంచి మూడేళ్లుగా పెండింగ్‌లో వున్న ఆర్జిత సెలవుల డబ్బు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని ఎపిపిటిడి ఎన్ఎంయు డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఎస్ జవహర్‌రెడ్డికి బుధవారం ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిసిలో అన్ని కేటగిరీల ఉద్యోగులకు ఈ మూడేళ్ల కాలంలో దాదాపు రూ.300 కోట్లు ఆర్జిత సెలవుల బకాయిలు పెండింగ్‌లో వున్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించేలా తక్షణం ఆర్జిత సెలవుల డబ్బును చెల్లించాలని డిమాండ్ చేశారు.

# పంట రుణాల కోసం కౌలు రైతుల ఆందోళనలు

**ప్రజాశక్తి-యంత్రాంగం**

పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతులు బుధవారం ఆందోళనలు చేశారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో యూనియన్ బ్యాంకు వద్ద సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులకు పంట ఋణాలు మంజూరు చేసి ప్రోత్సహించాలని, భూ యజమానితో సంబంధంలేకుండా సిసిఆర్ కార్డు ఆధారంగా రుణాలు ఇవ్వాలని, ప్రతి కౌలు రైతుకు రూ.1.60 లక్షల వరకు హామీ లేని రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. గుంటూరులోని లీడ్ బ్యాంక్ (యూనియన్ బ్యాంక్) కార్యాలయం ఎదుట ధర్నాలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడు లక్షల మందికిపైగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చామని ప్రభుత్వం గొప్పలు చెబుతోందని, పంట రుణాలు మాత్రం 70 వేల మందికి కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో రూ.నాలుగు వేల కోట్లు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నప్పటికీ ప్రతి సంవత్సరం కనీసం రూ.వెయ్యి కోట్లు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. కార్డులు వచ్చిన వారికి కూడా డబుల్ ఫైనాన్స్ పేరుతో పంట రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తున్నాయన్నారు.

గుంటూరులో లీడ్ బ్యాక్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

జెఎల్‌జి, రైతు మిత్ర గ్రూపులకు కూడా రుణాలు ఇవ్వకుండా అనేక ఆంక్షలు పెడుతున్నారన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టడం వలన కౌలు రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, బ్యాంకులు షరతులు వీడి కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై లీడ్ బ్యాంకు మేనేజర్ స్పందిస్తూ కార్డులు వచ్చిన ప్రతివారికి రుణాలు ఇస్తామని, సక్రమంగా నడుస్తున్న గ్రూపులకు కచ్చితంగా రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంకకు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ సిసిఆర్‌సి కార్డులు కలిగిన కౌలు రైతులకు రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతపురం, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆందోళనలు చేశారు.

పశ్చిమగోదావరిలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి

## పాత పెన్షన్‌ను పరిరక్షించుకుందాం

- యుటిఎఫ్ జాతాల్లో నాయకులు

**ప్రజాశక్తి-బాపట్ల, భీమవరం**

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకొని.. పాత పెన్షన్ విధానాన్ని పరిరక్షించుకుందామని యుటిఎఫ్ నాయకులు అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా అనంతపురంలో ప్రారంభమైన బైక్ జాతా బాపట్ల జిల్లాకు, ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా పశ్చిమగోదావరి జిల్లాలో బుధవారం కొనసాగింది. బైక్ జాతా మార్టూరు, పర్చూరు, చీరాల మీదుగా బాపట్లకు చేరుకుంది. బాపట్లలో యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై.భాస్కరరావు, రత్నరాజు, రాష్ట్ర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతోందని, దాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. రాష్ట్రంలో 44 వేల ప్రాథమిక పాఠశాలలున్నాయని, కేవలం 19 వేల పాఠశాలల్లో నామమాత్రంగానే విద్యార్థులు చేరారని, ఇదే విధానం కొనసాగితే రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు సమూలంగా మూతపడే అవకాశాలు ఉన్నాయన్నారు. పెన్షన్ విధానంపై ప్రభుత్వం అనుసరిస్తోన్న వైఖరి లోపభూయిష్టంగా ఉందన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, పాలకొల్లు, వీరవాసరం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం మీదుగా ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది. ఆయా మండలాల్లో నిర్వహించిన సభల్లో సంఘం రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా మాట్లాడారు. విద్యారంగ పరిరక్షణకు ఉద్యమాలు చేయడంతోపాటు సమాజానికి సేవ చేయడంలోనూ యుటిఎఫ్ ముందుందన్నారు. ఏడాది పొడవునా జరిగే స్వర్ణోత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.


కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking సిండికేట్ Syndicate
భారతినగర్ బ్రాంచ్ (2985)
భారతినగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 0866-2491437, 8331015694

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట "చట్టం" గా పిలవబడును) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత: మెస్సర్స్ ఏషియన్ ఇమేజింగ్ అండ్ డయోగ్నోస్టిక్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ. చలసాని రాకేష్, తండ్రి: మురళీ కృష్ణ, తనఖాదారు & హామీదారు: శ్రీ శ్రీనివాసరావు కోనేరు, తండ్రి: కె రాధాకృష్ణ మూర్తి మరియు హామీదారు: శ్రీమతి కోనేరు వజ్ర వీణ, తండ్రి: కె. శ్రీనివాసరావు** వారిని నోటీసులో ఉదహరించబడిన చెల్లించవలసిన బకాయి సొమ్ము **రూ.1,08,62,844.93 (అక్షరాల ఒక కోటి ఎనిమిది లక్షల అరవై రెండు వేల ఎనిమిది వందల నలభై నాలుగు రూపాయలు మరియు తొంభై మూడు పైసలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **18-07-2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీతలు సదరు పైన తెలిపిన బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ తెలిపిన ఆస్తిని **25-09-2023వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతలు, హామీదారు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి తేది. 25-09-2023 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ.1,01,48,610.93 (అక్షరాల ఒక కోటి ఒక లక్ష నలభై ఎనిమిది వేల ఆరు వందల పది రూపాయలు మరియు తొంభై మూడు పైసలు)** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

**సెక్యూర్డ్ ఆస్తి వివరములు**

**చరాస్తి:** ప్రాజెక్ట్ రిపోర్టు ప్రకారం అన్ని పరికరములు యావత్తు.

**స్థిరాస్తి:** కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్-రిజిస్ట్రీ, ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయితీ ఏరియా, ఇబ్రహీంపట్నం గ్రామం, ఆర్.ఎస్.నెం. 91/1, డి.నెం.31-105 నందు 545 చ.గ.లు. విస్తీర్ణం గల స్థలం మరియు అందులోని ఆర్‌సిసి గ్రౌండ్, 1వ అంతస్తు, 2వ అంతస్తు కలిగిన బిల్డింగ్ అన్ని ఇతర సౌకర్యాలతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: అబ్బూరి శ్రీనివాసరావు ఆస్తి, దక్షిణం: పశువుల హాస్పిటల్, పడమర: బజారు, ఉత్తరం: షేక్ ఖాజా, షేక్ బడేమియా యొక్క ఆస్తి.

తేది: 25.09.2023,
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్


## మహాధర్నాను జయప్రదం చేయండి : కెవిపిఎస్, వ్యకాస

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

సామాజిక న్యాయం, దళిత హక్కుల పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 29న విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద తలపెట్టిన మహాధర్నా జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి కోరారు. ధర్నాలో దళిత, ప్రజా సంఘాలు, ప్రజలు పెద్దయెత్తున భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు.

## అసెంబ్లీ సాక్షిగా మంత్రి అసత్యాలు : ఎస్‌డబ్ల్యుఎఫ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఎపిఎస్ఆర్‌టిసి ఉద్యోగులకు ఒక్కపైసా ఇవ్వకున్నా.. హయ్యర్ పెన్షన్ స్కీమ్‌ను తమ ఘనతగా చెప్పుకోవడం ప్రభుత్వానికి తగదని ఎస్‌డబ్ల్యుఎఫ్ పేర్కొంది. ఉద్యోగి డబ్బు పెట్టి కొనుక్కున్న పెన్షన్‌ను తామే ఇస్తున్నట్లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పి విశ్వరూప్ శాసనసభలో అబద్ధాలు చెప్పడం సరికాదని తెలిపింది. ఆర్‌టిసిలో 2014 నుండి ఇప్పటివరకు ప్రభుత్వం కానీ, ఆర్‌టిసి యజమాన్యం కానీ ఒక్క పైసా ఇపిఎఫ్‌కు చెల్లించలేదని తెలిపింది. హయ్యర్ పెన్షన్ విధానం ద్వారా ఉద్యోగులకు రూ.40 వేల పెన్షన్ ఏ విధంగా వస్తుందో చెప్పాలని డిమాండ్ చేసింది.

## ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత

- మంత్రి చెల్లుబోయిన

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఐదు రోజులపాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా ప్రయోజనాలకే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం మీడియా పాయింట్లో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు లేవనెత్తిన అనేక ప్రశ్నలకు రాష్ట్ర మంత్రులు సమాధానాలు తెలిపారన్నారు. బిసి సంఘాలు, నాయకులు కోరుతున్న విధంగానే రాష్ట్రంలో కులగణన చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ సమావేశాల్లో సాహసోపేత నిర్ణయం ప్రకటించారని తెలిపారు.

**చంద్రబాబు ఆస్తి రూ.2 లక్షల కోట్లు : రోజా**

టిడిపి అధినేత చంద్రబాబు ఆస్తి రూ.2 లక్షలు అని పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. హెరిటేజ్ కంపెనీలో 2 శాతం షేర్లు అమ్మితే రూ.400 కోట్లు వస్తాయని, మొత్తం అమ్మితే రూ.20 కోట్లు వస్తాయని ఇటీవల చంద్రబాబు భార్య భువనేశ్వరి చెప్పారని ఆమె పేర్కొన్నారు. చంద్రబాబు తన ఎన్నికల అఫిడవిట్‌లో రూ.20 వేల కోట్లను చూపారా లేదా అన్నది అధికారులు తేల్చాలన్నారు. హైదరాబాద్‌లో చంద్రబాబు ప్యాలెస్ విలువ రూ.600 కోట్లు ఉంటుందని, ఆయన అన్ని ఆస్తులు కలిపితే రూ.2 లక్షల కోట్లు ఉంటాయన్నారు. ఇదంతా ప్రజల్ని దోచుకున్న సొమ్మేనని ఆరోపించారు.

- క్రమబద్ధీకరణ బిల్లును ఆమోదించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఎంప్లాయీస్ జీవితాల్లో వెలుగులు నింపారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, కల్పలతరెడ్డి అన్నారు. వైసిపి ప్రభుత్వం క్రిటికల్ కేర్ వైద్యాన్ని మండల స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చిందని మరో ఎమ్మెల్సీ సుబ్రమణ్యం కొనియాడారు.
- అసెంబ్లీ సమావేశాల్లో టిడిపి హయంలో జరిగిన స్కామ్‌లపై అర్థవంతమైన చర్చ జరిగిందని ప్రభుత్వ విప్ ఉదయభాను అన్నారు. స్కామ్‌లకు సమాధానం చెప్పలేక టిడిపి సభ్యులు సభను బహిష్కరించి వెళ్లిపోయారన్నారు.

- **లావా కొత్త బ్లేజ్2 ప్రో 5జి ఆవిష్కరణ**

**దేశీయ మొబైల్ తయారీ కంపెనీ లావా కొత్తగా లావా బ్లేజ్ 2 ప్రో 5జిను ఆవిష్కరించింది. బడ్జెట్ ధరలో ఈ ఫోన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది.**


POONAWALLA HOUSING FINANCE
Apna Ghar, Apni Pehchan

**పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**
(గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది)
నమోదిత కార్యాలయం: 602, 6వ అంతస్తు, జీరో ఒన్ ఐటి పార్క్, ఎస్ఆర్.నం.79/1, ఘోర్పాడి, ముంధ్వా రోడ్డు, పూణె-411036. యూనిట్ యొక్క శాఖ : 2వ అంతస్తు, ప్లాట్ నం.16, డో.నం.40-6/2-16, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఎదురు, మొగల్‌రాజపురం, విజయవాడ-520010.

**ఇ-వేలం అమ్మకం నోటీసు**

**సర్ఫేసీ యాక్ట్ క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తి అమ్మకం**

సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు/సహా-రుణగ్రహీతలు/హామీదారులకు నోటీసు ఇవ్వడమేమనగా మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఇప్పుడు పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("పిహెచ్ఎఫ్ఎల్") గా తిరిగి మార్చబడినది దీనికి తాకట్టుపెట్టిన దిగువ పేర్కొన్న ఆస్తులను సర్ఫేసీ చట్టం యొక్క సెక్షన్ 13(4)/14 క్రింద కంపెనీ యొక్క సంబంధిత అధీకృత అధికారి ద్వారా తీసుకొనబడినాయి. వర్తించబడు వడ్డీ, చార్జీలు మరియు వ్యయాలు ఇతరత్రములతో మిగిలిన బకాయిలు పిహెచ్ఎఫ్ఎల్ తిరిగి రాబట్టుకొనుటకు దిగువ పేర్కొన్న నిబంధనల ప్రకారం ఇ-వేలం ద్వారా అమ్మబడును. వివరించబడిన ఆస్తి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్ 8 & 9 క్రింద "ఏది ఎక్కడ ఉందో, ఏది ఏమైన అ విధంగా మరియు ఎలాంటి సహాయంలేకుండా" అమ్మబడును: అమ్మకం యొక్క నిబంధనలు మరియు షరతులు వివరణ కొరకు, దయచేసి పిహెచ్ఎఫ్ఎల్ఎస్/సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా.., www.poonawallahousing.com లో అందించిన లింక్ ని చూడండి.

| ప్రతిపాదన నం. కస్టమర్ పేరు (ఎ) | డిమాండ్ నోటీసు తేది మరియు ఒకాయి మొత్తం (బి) | స్వాధీనత విధానం (సి) | ఆస్తి వివరణ (డి) | రిజర్వు ధర (ఇ) | ఇఎమ్‌డి (ఆర్‌పి 10 శాతం) (ఎఫ్) | ఇఎమ్‌డి సమర్పణ తేది (జి) | బిడ్ ఇంక్రిమెంటల్ (హెచ్) | ఆస్తి తనిఖీ తేది మరియు సమయం (ఐ) | వేలం తేది మరియు సమయం (జె) | తెలిసిన భారాలు/ఏదైనా కోర్టు కేసులు (కె) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| లోన్ నం.: HM/ 0053/H/18/ 100304 కొండేటి లూథర్స్ సన్ (రుణగ్రహీత) గుణదల వనితారాణి (సహా-రుణగ్రహీత) కొండేటి వరుణ్ కుమార్ (సహ రుణగ్రహీత) | నోటీసు తేది : 07.05.2022 మొత్తం బకాయి : 07.05.2022 నాటికి రూ.24,92,480.74/- (ఇరవై నాలుగు లక్షల తొంభై రెండు వేల నాలుగు వందల ఎనభై రూపాయల డెభై నాలుగు పైసలు మాత్రమే) రియలైజేషన్ వరకు @14.00% వడ్డీతో సహా చెల్లించాలి. | భౌతికం | కృష్ణాజిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, పాయకాపురం లో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహ ఎన్‌క్లేవ్ లో 2వ అంతస్తు, ఫ్లాట్ నం.ఎస్ఎఫ్2, బేరింగ్ ప్లాట్ నం.55, బేరింగ్ ఆర్.ఎస్.నం.లు. 18/1, 19/2బి మరియు 19/2సి రెండవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ అందులో ప్లింత్ ఏరియా 1021 చ.అ.లు. తో పాటు కామన్ ఏరియా, బాల్కానీ మరియు 80 చ.అ.లు. కార్ పార్కింగ్ తో కలిపి తనఖా ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ సైట్ యొక్క అవిభక్త మరియు పేర్కొనబడని ఉమ్మడి హక్కు 37 చ.గ.లు. లేదా 30.93 చ.మీ.లు. మొత్తం విస్తీర్ణం 223.66 చ.గ.లు. లేదా 187.00 చ.మీ.లు. | రూ.28,90,125/- (ఇరవై ఎనిమిది లక్షల తొంభై వేల ఒక వందా ఇరవై ఐదు రూపాయలు మాత్రమే) | రూ.2,89,012.5/- (రెండు లక్షల ఎనభై తొమ్మిది వేల పన్నెండు రూపాయల ఐదు పైసలు మాత్రమే) | 30/10/2023 Before 5 PM | 10,000/- | 23/10/2023 (11AM – 4PM) | 31/10/2023 (11 AM- 2PM) | NIL |

ఉద్దేశించిన బిడ్డర్లు/కొనుగోలుదారులు బ్రాంచ్ మరియు వేలంలో ఉంచిన ఆస్తులను సందర్శించాలని మరియు ఛార్జీలు, సంకేతాలకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని కొనుగోలుదారు తన సొంత విచారణ చేసుకోవాలి మరియు అదనపు ఛార్జీలు, సంకేతాలు మరియు ఏదైనా మూడవ పార్టీ ఆసక్తులను నిర్ధారించాలి మరియు దానిలోని అన్ని అంశాలలో తనను తాను/తనను తాను సంతృప్తి పరచాలి. ఆస్తిపన్ను, విద్యుత్ బకాయిలు మరియు ఇతర బకాయిలు వంటి అన్ని చట్టబద్ధమైన బకాయిలు, ఏదైనా ఉంటే, ఆస్తికి జతచేయబడి, విజయవంతమైన బిడ్డర్లు/కాబోయే కొనుగోలుదార్లు చేత నిర్ధారించబడాలి. వేలం వేసేవారు(లు)/కాబోయే కొనుగోలుదారు (లు) బిడ్లు సమర్పించే ముందు, పైన పేర్కొన్న వాటికి సంబంధించి మరియు పైన పేర్కొన్న ఆస్తి/ఆస్తులకు సంబంధించిన ఇతర సంబంధిత వివరాలకు సంబంధించి తనను తాను/తనను తాను సంతృప్తి పరచాలని అభ్యర్థించారు.
2. ఆసక్తిగల బిడ్డర్లు తమను పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి మరియు ముందుగానే లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను పొందాలి, ఇది ఇ-బిడ్డింగ్ కోసం తప్పనిసరి, వేలం సేవా ప్రదాత సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి ఇ-బిడ్డింగ్‌కు తప్పనిసరి. చిరునామా- ప్లాట్ నెం-68 3వ అంతస్తు గుర్గావ్ హర్యానా-122003, హెల్ప్‌లైన్ నం.: 7291981124,25,26 సపోర్ట్ ఇమెయిల్ ఐడి: -Support@bankeauctions.com. సంప్రదించాల్సిన వ్యక్తి : వినోద్ చౌహాన్, ఇ మెయిల్ ఐడి : delhi@c1india.com సంప్రదించాల్సిన నం.:9813887931, కాబోయే బిడ్డర్లు వారి నుండి మాత్రమే ఇ-వేలంలో ఆన్‌లైన్ శిక్షణ పొందవచ్చని దయచేసి గమనించండి. "పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్", బ్యాంక్-ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, ఖాతాలో NEFT /RTGS ద్వారా ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) మొత్తాన్ని ఉద్దేశించిన కొనుగోలుదారు/బిడ్డర్ సమర్పించాలి. ఖాతా నెం- 000651000460 మరియు IFSC కోడ్- ICIC0000006, 20, ఆర్.ఎన్. ముఖర్జీ రోడ్డు, కోల్కత్త-700001 ఏదైనా జాతీయ బ్యాంక్ లేదా షెడ్యూల్ బ్యాంక్ లేదా 30.10.2023 లోపు తీయాలి వారి పేరును https://www.bankeauctions.com లో నమోదు చేసుకోండి మరియు యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్ ఉచితంగా పొందండి మరియు సర్వీస్ ప్రొవైడర్ నుండి ఇ-వేలంపై శిక్షణ పొందండి. వెబ్‌సైట్‌లో వారి రిజిస్ట్రేషన్ తరువాత, కొనుగోలుదారు/బిడ్డర్ ఈ క్రింది డాక్యుమెంట్ల కాపీలను అప్‌లోడ్, ఇ-మెయిల్ మరియు స్వీయ-ధృవీకరించిన హార్డ్ కాపీని చిరునామా : 2వ అంతస్తు, ప్లాట్ నం.16, డో.నం.40-6/2-16, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఎదురు, మొగల్‌రాజపురం, విజయవాడ-520010 మొబైల్ నం.: +91 8588802671 మరియు +91 9910453434 ఈ-మెయిల్ ఐడి anoop.kumar@poonawallahousing.com కు పంపవలెను.

తేది: 11.08.2021
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది)

సంపాదకీయం

# మొట్టికాయలు!

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల న్యాయ వ్యవస్థ ప్రతిభావంతులైనవారిని దూరం చేసుకోవాల్సి వస్తోందని సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయవలసి రావడం విచారకరం. హైకోర్టుల్లో న్యాయమూర్తుల పదవుల కోసం కొలీజియం ఎంపిక చేసిన జాబితాపై నెలల తరబడి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తుండటంతో ఈ పరిస్థితి ఎదురైందన్న దేశ సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు మోడీ సర్కారుకు మొట్టికాయలుగా భావించాలి. 'అడ్వకేట్స్ అసోసియేషన్ ఆఫ్ బెంగళూరు' దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా వివిధ హైకోర్టుల్లోని జడ్జీ పోస్టుల ఖాళీలు, వాటి భర్తీకి కొలీజియం వ్యవస్థ చేస్తున్న ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటున్న తీరు స్పష్టంగా ముందుకొచ్చింది. హైకోర్టు కొలీజియమ్‌లు న్యాయమూర్తుల పదవుల కోసం సిఫార్సు చేసిన దాదాపు 70 పేర్లను కేంద్ర ప్రభుత్వానికిస్తే 2022 నవంబరు నుండి దాదాపు పది మాసాల పాటు పెండింగ్‌లో పెట్టారు. బెంచ్‌లో చేరేందుకు తమ లా ప్రాక్టీస్‌ను వదులుకోవడానికి సుముఖంగా వున్న, మెరుగైన ప్రతిభ కలిగిన వారు ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధితులు అవుతున్నారని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అకారణంగా కొందరి పేర్లను తొలగించడానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పేర్కొంది. అంటే సర్కారు తమకు నచ్చని వారిని న్యాయ వ్యవస్థలోకి రానీయకుండా అడ్డుకుంటోందనే కదా! ఖాళీలను అలాగే ఉంచి పరివార్ కుదురు నుండి వచ్చినవారితో న్యాయ వ్యవస్థను నింపేయాలన్నది ప్రభుత్వ పథకం కావచ్చు. కాబట్టి కీలకమైన అన్ని రాజ్యాంగ వ్యవస్థల్లోకి సంఘీయులను చొప్పించడమే మోడీ సర్కారు లక్ష్యంగా ఉందన్న విమర్శ కాదనలేని వాస్తవం.

ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో మంజూరైన 1,114 జడ్జి పోస్టుల్లో 774 మంది మాత్రమే పని చేస్తుండగా 340 ఖాళీలున్నాయి. ఆ యా కోర్టుల్లో 60,72,729 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో 45,22,626 కేసులు ఏడాది పైబడి పెండింగ్. జడ్జి పోస్టుల్లో 30 శాతం పైగా ఖాళీలుంటే కేసుల పెండెన్సీ మరింత పెరుగుతుందే తప్ప పరిష్కారం కావు. "హైకోర్టులో న్యాయమూర్తి పదవులు చేపట్టేందుకు ముందుకు రావడానికి తిరస్కరిస్తున్నారు. అయినా మేం ప్రయత్నించాం, మంచి టాలెంట్ ఉన్నవారిని న్యాయమూర్తులుగా తీసుకునేందుకు కృషి చేశాం, కానీ పేర్ల విభజన కారణంగా మంచి టాలెంట్‌ను కోల్పోవాల్సి వస్తోంది." అని సర్కారు వైఖరి మూలంగా కొలీజియం కృషి వృధా అవుతున్న తీరును సుప్రీం ధర్మాసనం వివరించింది. 'న్యాయం ఆలస్యం చేయడం న్యాయాన్ని తిరస్కరించడమే'నన్న నానుడి అందరికీ తెలిసిందే. ఆ పరిస్థితి ఏర్పడడానికి మూల కారణం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమేనని తాజా విచారణలో స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ 'కొరడా ఝుళిపించి, కోర్టు ధిక్కారానికి పాల్పడిన వారిని ప్రక్షాళన చేయాల్సిన సమయమిదని ఈ తరహాలో ఇకపై జరగరాదని' పేర్కొనడం సబబు అనిపిస్తోంది. ప్రతిభావంతులైనవారిని అన్ని తరగతులు, ప్రాంతాల నుండి న్యాయ వ్యవస్థలోకి తీసుకోవడం ఎంతో అవసరం.

శాసన, పరిపాలన, న్యాయ వ్యవస్థలు భారత రాజ్యాంగంలోని ప్రధాన అంగాలు. ప్రజలకు సకాలంలో సరైన న్యాయం అందడం ఎంతో అవసరం. అంతేగాక రాజ్యాంగం ప్రకారం మిగిలిన రెండు వ్యవస్థలు పని చేస్తున్నాయా లేక ఏవైనా ఉల్లంఘనలున్నాయా అన్న అంశాలు కూడా న్యాయ వ్యవస్థ పరిధిలోనివే. రాజ్యాంగ అన్వయింపు బాధ్యత దానిదే. కాబట్టి ఇంత కీలకమైన న్యాయ వ్యవస్థలో ఖాళీలన్నిటినీ భర్తీ చేయడం కేంద్ర ప్రభుత్వ విద్యుక్త ధర్మం. ఆ పని వెంటనే చేపట్టాలి. అలాగే కొలీజియం సూచించిన పేర్లలో కొన్నిటిని కారణం చెప్పకుండా తిరస్కరించడం తగదు. తన వైఖరిని సరిచేసుకోవడం అవసరం. సుప్రీం ధర్మాసనం తదుపరి వాయిదాగా నిర్ణయించిన అక్టోబర్ 9 లోగా ఖాళీలను కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలి. కనీసం పెండింగ్ పెట్టిన 70 పేర్లయినా క్లియర్ చేయాలి. అటువంటి విజ్ఞతను ప్రదర్శిస్తుందో లేదో వేచి చూడాల్సిందే!

మంచి మాట

ముందు తరాలకు విద్యను అందించాలని ప్రపంచానికి నేను చెప్పదలుచుకున్నాను. ఎందుకంటే అది చాలా ముఖ్యమైనది. మనం వారికి కలాలు ఇవ్వకపోతే ఉగ్రవాదులు వారికి తుపాకులిస్తారు.

**- మలాలా యూసఫ్‌జాయ్**

Malala Yousafzai

# మహాకవి జాషువాకు అక్షర నివాళి

నివాళి

**విల్సన్ రావు కొమ్మవరపు**

'రాజు మరణించే నొకతార రాలిపోయే / సుకవి మరణించే నొకతార గగనమెక్కే / రాజు జీవించు రాతి విగ్రహములందు / సుకవి జీవించు ప్రజల నాల్కల యందు' అంటూ జాషువా...రాజుకు, సుకవికి తేడాను వివరిస్తూ రాసిన ఈ పద్యం వినని, చదవని కవి అంటూ తెలుగు నేలపై ఉండరని నేను అనుకుంటాను.

భారతీయ సాహిత్యంలో కవిది ప్రథమ స్థానం. ఇంకా చెప్పాలంటే సృష్టికర్తతో సమానం. సంస్కృతంలో కాళిదాసుకు ఎంత పేరుందో తెలుగులో జాషువాకు అంత పేరుంది. కాళిదాసును కవికుల గురువు అంటారు. దాదాపు అదే స్థానం జాషువాకు కూడా లభించింది. సంస్కృత వాఙ్మయం కాళిదాసు మయమైతే తెలుగు వాఙ్మయం జాషువామయం.

అలాంటి జాషువా కుటుంబం ఎంత పేదరికం అనుభవించిందనడానికి కింది ప్రస్తావన ఒక ఉదాహరణ మాత్రమే.

సంక్రాంతికి, ఉగాదికి, దసరాకు కొత్త బట్టలు ధరించటం, పండుగను ఘనంగా చేసుకోవటం చాలామంది ఇళ్లలో చూస్తూనే ఉంటాం. అలాగే జాషువా ఊళ్ళో కూడా ఒక పండుగ రోజున తోటి పిల్లలు, పెద్దలు చాలామంది కొత్తబట్టలు ధరించి, తాజాగా చేసిన పిండివంటలు తింటూ కనిపించారు. చిన్నవాడైన జాషువా, తమ్ముడు ఇశ్రాయేలు ఇద్దరూ తమకు కొత్త బట్టలు కావాలని, మిఠాయి పెట్టమని తల్లిని మారాము చేయసాగారు. తల్లి చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. ఇంటిలో సరుకులు నిండుకున్నాయి. పిల్లల దీనాలాపాన వింటే తల్లి హృదయం పిండి వేసినట్లయింది. పిల్లలను వెంట తీసుకొని అప్పైనా పుడుతుందేమోనని, ఊరిలోని కొట్టుకు వెళుతోంది. ఒక వీధిలో ఒక చిన్న పాప పళ్ళెం నిండా ఏవో తినుబండారాలు తీసుకొనిపోతూ వుండగా కొన్ని కిందబడ్డాయి. ఆ బాలిక వాటిని చూసుకోకుండా అలాగే వెళ్ళిపోయింది. అది చూచిన జాషువా.. వెంటనే వెళ్లి ఆ కింద పడిన వస్తువును అపరిశుభ్రం అన్న విషయానికి కూడా తావు ఇవ్వక తీసుకున్నాడు ఆనందిస్తూ. తల్లి చూచింది. 'అది తప్పు అనటానికి కూడా ఆమెకు నోరు రాలేదు' చూడండి. జాషువా తన బాల్యంలో ఎంతటి పేదరికం అనుభవించాడో.

తను కవిత్వం రాసే తొలినాళ్ళలో ఎన్ని అవమానాలు పొందాడో చూడండి. ఒకసారి జాషువా రైల్లో ప్రయాణం చేస్తున్నాడు. అదే కంపార్ట్‌మెంట్‌లో వున్న పండితుడు జాషువా చేతిలో వున్న పుస్తకాలు చూచి, ఆయన కవి అని గుర్తించి కవిత్వం వినిపించమని కోరాడు. జాషువా స్వీయ కవిత్వం వినిపించాడు. భేష్ ! భేష్ !! మీ కవిత్వం అద్భుతం, మీది ఏ కులం అని ప్రశ్నించాడు.

'నేను క్రైస్తవుణ్ణి' అని జవాబిచ్చి ఆ తరువాత 'కవికి గానీ, కళకు గానీ కులమతాలున్నాయా?' అని ప్రశ్నించాడు జాషువా. 'అయ్యయ్యో! వాణి అంటుపడ్డది' అంటూ చివుక్కున లేచిపోయి మరోచోట కూర్చున్నాడు ఆ పండితుడు.

ఈ సంఘటన జాషువా హృదయాన్ని కలచివేసింది. తన ఆవేదనను మానితరావు వేంకట కుమార మహీపతి సూర్యారాయ వారికి (పిఠాపురం రాజావారికి) నివేదించుకున్నాడు. ఏమని నివేదించుకున్నాడు: "నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపరే/ ఖా కమనీయ వైఖరులుగాంచి "భళీ! భళి" యన్నవాడె "మీ/దేకుల" మన్న ప్రశ్న వెలయించి, 'చివాలున లేచి పోవుచో/ బాకున గ్రుమ్మినట్లగును పార్థివ చంద్ర! వచింప సిగ్గగున్' అంటాడు జాషువా.

జాషువా కవిగా ఉజ్వల దశలో వున్నప్పుడు కూడా కొన్ని వ్యథా ఘట్టాలు ఎదుర్కోక తప్పలేదు. అలాంటి వాటిలో కాకినాడ సభ ఒకటి. 'కోరిక కాకినాడ సభకుం జనినాడను... భూరి కవీంద్ర గోష్టికిని బోయితి, నా గరిమన్ హేళన చేసె నొక్కకవి ధిక్కారంబు గావించుచున్' అని జాషువా తనని అవమానించిన ఆ కవి ధిక్కారానికి తల వంచలేదు. పౌరుషంతో, సంపూర్ణమైన ఆత్మ విశ్వాసంతో తనని అవమానించే వారి నోళ్ళను శాశ్వతంగా మూయించే పద్యం చెప్పాడు.

"గవ్వకు సాటిరాని పలుగాకుల మూక లసూయ చేత న/న్నెవ్విధి దూరినన్ నను వరించిన శారద లేచిపోవునే/ యివ్వసుధాస్థలిం బొడమరే రసలుబ్ధులు ఘంటమూనెదన్ /రవ్వలు రాల్చెదన్ గరగరల్ సవరించెద నాంధ్ర వాణికిన్" అని పద్యంతోనే సమాధానమిస్తాడు జాషువా.

జాషువా జీవితంలో ఇటువంటి ఎదురుదెబ్బలు ఎన్నో తగిలాయి. వీటికి ఆయన భయపడలేదు. రాటుదేలాడు. జీవితంలోని ప్రతి సన్నివేశం లోంచి ఆయన కవిత్వాన్ని దర్శించాడు. ఆయన జీవిత వాంఛ కవిత్వ రూపంలో నెరవేరింది. కవిత్వమే ప్రధానాంశంగా బతికిన జాషువా అందుకోసం ఎంతో సంఘర్షణకు గురికావాల్సి వచ్చింది. ఆర్థికంగా, మానసికంగా ఎన్నో కష్టాల్ని వ్యథా ఘట్టాల్ని చూడవలసి వచ్చింది

ఇలాంటిదే మరో సంఘటన: అవధానిగా ప్రసిద్ధిగాంచిన కొప్పరపు సుబ్బారావు కవి ఒకసారి వినుకొండకు వచ్చారు.

**నేడు జాషువా 128వ జయంతి**

ఆయన గౌరవార్థం కవులంతా కలిసి వినుకొండ ఊళ్ళో సభ ఏర్పాటు చేశారు. కవుల మీద, కవిత్వం మీద ఉన్న గాఢమైన అభిమానం కారణంగా జాషువా 'కొప్పరపు' కవిపై అభినందన పద్యాలు రాశాడు. ఆ కవికి పద్యాలు ఎలా అందజేయాలా అని మథనపడుతూ ఉంటే, ఒక బ్రాహ్మణ మిత్రుడు జాషువా అవస్థ గుర్తించి, చెయ్యి పట్టుకొని సభలోకి తీసుకెళ్ళి కవిగారితో పరిచయం చేయించాడు. తన మీద ఒక స్థానిక యువకవి రాసిన పద్యాలు చదివి 'కొప్పరపు' కవి ఎంతో సంతోషించాడు. ఈ లోపు సభలో పెద్ద అలజడి మొదలయ్యింది. నిమ్నజాతి వాడు ఈ సభలోకి ఎలా వచ్చాడని దుర్భాషలాడుతూ జాషువాను అనిమానించినప్పుడు..ఆ అవమాన భారంతో బయటపడి...ఆ రాత్రి అంతా కంటి మీద కునుకు లేకుండా గడిపాడు జాషువా. జాషువా ఈ అవమాన భారం లోంచి తేరుకోవడానికి కవిత్రయం రాసిన మహాభారతం చదివాడు. కుమారాస్త్రం ఘట్టంలో కర్ణుడితో తనని అన్వయం చేసుకున్నాడు. కర్ణుడితో తనను, తనలో కర్ణుడిని చూసుకున్నాడు.

జాషువా తొలి కవితా ప్రయత్నాలకు దోహదకారులైన వ్యక్తుల్లో తోలేటి సుబ్బారావు పాత్ర మరువలేనిది. వారి ప్రోద్బలంతోనే రాజమండ్రిలోని చింతామణి నాటక మండలి యజమాని సత్యవోలు గున్నేశ్వర రావుని కలిసి చింతామణి

> **విస్పష్టమైన భావ వ్యక్తీకరణ జాషువా సొంతం. ఆయన ఒకానొక సందర్భంలో : 'జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాకు గురువులు ఇద్దరు. పేదరికం. కుల మత బేధం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండవది నాకు ఎదిరించే శక్తిని పెంచిందే గాని బానిసగా మాత్రం మార్చలేదు. దారిద్ర్యాన్ని, కులబేధాన్ని కూడా చీల్చి నేను మనిషిగా నిరూపించుకోగలిచాను. వాటిపై కత్తి గట్టాను. అయితే నా కత్తి కవిత. నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపై ద్వేషం'. అంటాడు. మతము, కులము..మనిషిని ఎంత కుంగదీస్తాయో స్వానుభవంతో దెబ్బతిన్న పులి అయ్యాడు. అంటరానివాడు కవిత్వం రాయడం నేరమన్న వ్యవస్థని ధిక్కరించాడు.**

నాటక మండలిలో రచయితగా కుదురుకున్నారు. గున్నేశ్వరరావు ప్రోద్బలంతో 'రుక్మిణీ పరిణయం' అనే తన తొలి నాటకం రాశారు. అంతేకాక, కాశీనాథుని నాగేశ్వరరావు ప్రోత్సాహం వలన జాషువా రచనలు భారతి పత్రికలో విరివిగా అచ్చవుతూ ఉండేవి.

కులమతాలు గీచుకొన్న గీతల జొచ్చి/ పంజరాన గట్టువడను నేను / నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు / తరుగు లేదు, విశ్వనరుడ నేను.

జాషువా తనను తాను ఆవిష్కరించుకున్న పద్యమే ఆయన అనుభవించిన మత సంఘర్షణకి ప్రతీకగా పై పద్యాన్ని చూడవచ్చు. జాషువా వ్యక్తిత్వంలోను, కవిత్వంలోనూ వచ్చిన పరిణామానికి ఈ పద్యాన్ని తార్కాణంగా చెప్పవచ్చు.

ఒక దృశ్య, శ్రవణ నాటకంలో ఒక వాతావరణాన్ని అద్భుతంగా కళ్ళకు కట్టినట్టు చూపించడంలో కవి ప్రతిభ...అనన్య సామాన్యంగా ఉండాలి. లేకపోతే ఆ నాటకం రక్తి కట్టదు. మరుభూమిలో సాధారణంగా కనిపించే ఒక వాతావరణాన్ని జాషువా ఎంతో అద్భుతంగా కళ్ళకు కట్టారు.

సత్య హరిశ్చంద్రుడు రాజ్యాన్నంతా పోగొట్టుకున్న తరువాత కాశీకి వెళ్ళి...ఆఖరున కాటి కాపరి ఉద్యోగం చేశాడు. సర్వం సహా చక్రవర్తి అయినటువంటి సత్యహరిశ్చంద్రుడు విధి వశాత్తు వేదాంత ధోరణిలో పలికే మాటలను సత్య హరిశ్చంద్ర నాటకంలో జాషువా..హరిశ్చంద్రుడు పాత్ర లోకి పరకాయ ప్రవేశం చేసి రాసిన పద్యాలు ఆ నాటకానికే వన్నె తెచ్చాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

జాషువా కవితా విశారద, కవి దిగ్గజ, నవయుగ కవి చక్రవర్తి, విశ్వకవి సామ్రాట్, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ మొదలైన ఎన్నో బిరుదులు పొంది ఉండవచ్చు గాక, కానీ తాను మొదటి సన్మానంలో అందుకున్న పది సేర్ల పెసలు, తన స్వంత ఊరిలో మొదటిగా జరిగిన సన్మానంలో పొందిన 116 రూపాయల బహుమతి ఆయనకు గొప్ప అనుభూతి.

విస్పష్టమైన భావ వ్యక్తీకరణ జాషువా సొంతం. ఆయన ఒకానొక సందర్భంలో : 'జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాకు గురువులు ఇద్దరు. పేదరికం. కులమత బేధం. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండవది నాకు ఎదిరించే శక్తిని పెంచిందే గాని బానిసగా మాత్రం మార్చలేదు. దారిద్ర్యాన్ని, కులబేధాన్ని కూడా చీల్చి నేను మనిషిగా నిరూపించుకోగలిచాను. వాటిపై కత్తి గట్టాను. అయితే నా కత్తి కవిత. నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపై ద్వేషం'. అంటాడు. మతము, కులము..మనిషిని ఎంత కుంగదీస్తాయో స్వానుభవంతో దెబ్బతిన్న పులి అయ్యాడు. అంటరానివాడు కవిత్వం రాయడం నేరమన్న వ్యవస్థని ధిక్కరించాడు.

జీవితంలో ఎన్నో అమానవీయ సంఘటనలను ఎదుర్కొన్న జాషువా...ఆ అమానవీయ సంఘటనలను తన రచనలలో మానవీయ దృక్పథంతో వెలువరించారు.

జాషువా రచనలు ప్రజాపక్షం. జీవితం పట్ల అభ్యుదయ దృక్పథం గలవాడు. మూఢాచారాలు, మత డాంబిక ఉత్సవాలు ఆయనకు గిట్టేవి కాదు. తన కుటుంబంలో కూడా ఇలాంటివి జరగడానికి ఇష్టపడేవాడు కాదు. తన రచనలలో ఉదారవాదిగా కనపడవచ్చు గాని ఆచరణలో ఆయన పూర్తి నాస్తికుడు. ఆయనలో కొన్ని తిరుగుబాటు లక్షణాలు కనబడతాయి. పాత విలువల్ని, కుహనా సంస్కృతుల్ని ధ్వంసం చేయాలనే పరిణామ దృష్టి ఆయనలో కనబడుతుంది. ఇందుకు ఉదాహరణగా హేమాలతా లవణంల వివాహమే.

కడు పేదరికం నుండి వచ్చిన వ్యక్తి పట్టుదలతో, కార్యదీక్షతో పద్మభూషణ్ దాకా ఎదిగి, ఎన్నో సాంఘిక సమస్యలను చాలా సరళమైన భాషలో అచ్చ తెలుగులో సమాజానికి పట్టి చూపి తెలుగు నేలపై తన ముద్రను దశాబ్దాలుగా పరిచిన జాషువాకు నివాళులు.

**/ వ్యాసకర్త సెల్ : 8985435515 /**

★

# మతోన్మాదంపై పోరాటానికి భగత్‌సింగ్ జీవితం మార్గదర్శకం

సందర్భం

**నేడు దేశంలో ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు విశృంఖలంగా కొనసాగుతున్నాయి. కోట్లాది మంది సామాన్య ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిన పాలకులు కొద్దిమంది పెట్టుబడిదారుల సేవలో తరిస్తున్నారు. వీటిని చూస్తుంటే షహీద్ భగత్‌సింగ్ కలలుగన్న సమసమాజం ఈ దేశంలో ఇంకా అందనంత దూరంలోనే ఉండిపోయిందని అర్థమవుతోంది. స్వాతంత్ర్య సమర వీరులు కలలుగన్న సమ సమాజాన్ని నిర్మించడానికి.. షహీద్ భగత్‌సింగ్ తాత్విక చింతనను, ఆయన ఆశయాలను కొనసాగించడమే సరైన పరిష్కారం.**



**ఆర్. రాజేశమ్**

"భారతదేశ పరిస్థితి నేడు దయనీయంగా మారింది. ఒక మతం వారు ఇతర మతం వారిని బద్ద శత్రువులుగా చూస్తున్నారు. నేడు దేశ భవిష్యత్తు చీకటిగా కనిపిస్తోంది. ఈ మత రాజకీయాలు భారత దేశాన్ని దెబ్బ తీశాయి. ప్రపంచ వేదికపై భారతదేశానికి సిగ్గుచేటుగా పరిణమించాయి. సామాన్య ప్రజలపై సాగుతున్న దారుణాల నుండి రాజకీయ ప్రయోజనాలను పొందేందుకే నాయకులు ప్రయత్నిస్తున్నారు." నేటి దేశ పరిస్థితిని వర్ణించడానికి సరిపోయే మాటలివి. అయితే ఈ మాటలు ఇప్పటివి కావు. నేటికి 96 సంవత్సరాల క్రితం 1927లో.. పంజాబ్ నుండి వెలువడే 'కీర్తి' అనే పత్రికలో ప్రచురించబడిన "మత ఘర్షణలు, వాటి నివారణ" వ్యాసం లోని మాటలివి. ఆ వ్యాస రచయిత పేరు షహీద్ భగత్‌సింగ్! విప్లవ వీరుడిగా.. చిరుప్రాయంలోనే దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబమెక్కిన త్యాగధనుడు. ఆ నాడే మతోన్మాద రాజకీయాలను పూర్తిగా వ్యతిరేకించాడన్న వాస్తవం నేడు చాలా మందికి తెలియదు.

బ్రిటిష్ సామ్రాజ్యవాద దాస్య శృంఖలాల నుండి భారత దేశాన్ని విముక్తం చేయడానికి 23 ఏళ్ల చిరు ప్రాయంలోనే ప్రాణార్పణ గావించిన అమరవీరుడు షహీద్ భగత్‌సింగ్. 1931, మార్చి 23న నాటి బ్రిటిష్ పాలకులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను లాహోర్ జైలులో ఉరితీశారు. పరాయి పాలకులను దేశం నుండి తరిమికొట్టాలనే ఆకాంక్షతోనే ఆగి పోకుండా.. స్వతంత్ర భారతదేశంలో ఎలాంటి విధానాలు అవలంబిస్తే ప్రజలకు మేలు కలుగుతుందనే విషయంలోనూ సమగ్ర దృక్పథం కలిగిన కొద్దిమంది స్వాతంత్ర్య ఉద్యమకారుల్లో భగత్‌సింగ్ ఒకడు. ఆయన 28 సెప్టెంబర్, 1907న నేటి పాకిస్థాన్ లోని ఫైసలాబాద్ జిల్లా, బంగా గ్రామంలో జన్మించాడు. యుక్త వయస్సులోనే స్వాతంత్ర్యోద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. 'పంజాబ్ కేసరి' లాలా లజపతిరాయ్ నాయకత్వంలో నాడు ఉధృతంగా కొనసాగుతున్న విప్లవకర ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. నాటి యువతను ఉత్తేజపరిచిన నౌజవాన్ భారత్ సభ, హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాడు. 1928లో సైమన్ కమిషన్ రాకను నిరసిస్తూ లాలా లజపతిరాయ్ నాయకత్వంలో పెద్దయెత్తున ధర్నాలు, హర్తాళ్లు కొనసాగాయి. లాహోరులో జరిగిన నిరసన ప్రదర్శనపై విరుచుకుపడిన బ్రిటిష్ పోలీసులు లజపతిరాయ్‌ను లాఠీలతో తీవ్రంగా గాయపరిచారు. నవంబర్ 17న ఆయన ఆస్పత్రిలో కన్నుమూశాడు. లాలాజీ మరణానికి కారకుడైన బ్రిటిష్ పోలీసు అధికారి స్కాట్‌ను చంపాలనుకున్న భగత్‌సింగ్ మిత్రబృందం సాండర్స్‌ను చంపారు. దేశ ప్రజల్లో విప్లవ భావాలు మరింతగా ప్రచారం చేయాలనే ఉద్దేశంతో.. 1929 ఏప్రిల్ 8న భగత్‌సింగ్, బటుకేశ్వరదత్తులు ఢిల్లీ లెజిస్లేటివ్ అసెంబ్లీలో బాంబులు పేల్చారు. ప్రాణనష్టం జరగని రీతిలో బాంబులు వేసి, నినాదాలిస్తూ, కరపత్రాలు పంచుతూ అక్కడే నిల్చుండి అరెస్టయ్యారు. అసెంబ్లీపై బాంబు దాడి కేసుతో పాటు, సాండర్స్ హత్యకేసును తిరగదోడిన బ్రిటిష్ ప్రభుత్వం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లకు ఉరిశిక్ష వేసింది.

గాంధేయ మార్గానికి భిన్నంగా విప్లవ కార్యాచరణ ద్వారా దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది వీరపుత్రులు ఉద్యమించారు. స్వాతంత్ర్య పోరాట చరిత్రలో వీరు నెరపిన పోరాటం కూడా సముజ్వల ఘట్టంగా నిలిచిపోయింది. ఈ తరహా విప్లవ వీరుల్లో షహీద్ భగత్‌సింగ్‌ది విశిష్టస్థానం. దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం సాధించడంతోనే ఆగిపోకుండా, స్వతంత్ర భారతానికి ఆర్థిక స్వాతంత్ర్యం కూడా సిద్ధించాలని, సామాన్యుడి సంక్షేమం సాకారం కావాలంటే దేశం సామ్యవాద పంథాను అనుసరించాలనే దృక్పథంతో ఉద్యమించిన వీరుడు భగత్‌సింగ్.

పద్దెనిమిదేళ్ల చిరుప్రాయానికే వివిధ రాజకీయ విధానాలకు సంబంధించిన అధ్యయనంలో భగత్ మునిగిపోయాడు. సింక్లేర్, విక్టర్ హ్యూగో, దాస్తోవస్కీ, బుకారిన్, మార్క్స్, లెనిన్ రచనలను విస్తారంగా చదివాడు. ఈ విస్తృత అధ్యయనం వెలుగులో.. ప్రజాస్వామ్యం, హేతువాదం, సామ్యవాద వ్యవస్థ సాధన కోసం తన రాజకీయ కార్యాచరణ కొనసాగాలని నిర్దేశించుకున్నాడు. 'ఒక మనిషిని మరొక మనిషి, ఒక జాతిని వేరొక జాతి.. పీడించే సాంఘిక ధర్మాని'కి ముగింపు పలకడమే తన రాజకీయ లక్ష్యంగా భగత్‌సింగ్ ప్రకటించాడు. తెల్లోడిని తరిమికొట్టి నల్లోడికి అధికారం కట్టబెట్టడమే, స్వాతంత్ర్య పోరాట ఉద్దేశం కాదని భగత్‌సింగ్ తెగేసి చెప్పాడు. అన్ని రకాల పీడనలకు అంతం పలికినప్పుడే భరతమాతకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుందని గాఢంగా విశ్వసించాడు. నాడు భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, రాంప్రసాద్ బిస్మిల్ మొదలగు విప్లవకారుల వేదికగా హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ కొనసాగేది. భగత్‌సింగ్ చొరవతో సంస్థ పేరు హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్‌గా మారింది. 'వందేమాతరం' నాటివరకు విప్లవకారుల రణన్నినాదంగా ఉండేది. భగత్‌సింగ్ రాకతో 'ఇంక్విలాబ్ జిందాబాద్' తోడైంది. భవిష్యత్తు భారతం ఎలా ఉండాలనే అంశంపై స్పష్టమైన దృక్పథం గల విప్లవకారుడు భగత్‌సింగ్. పల్లెల్లోని రైతులను, ఫ్యాక్టరీల్లోని కార్మికులను చైతన్య పరచినప్పుడే దేశంలో సమ సమాజం సిద్ధిస్తుందని కలలు కన్నాడు. దోపిడీ వ్యవస్థలన్నీ సమూలంగా అంతమయ్యే వరకు స్వాతంత్ర్య పోరాటం కొనసాగాల్సిందేనని ఆయన తన సహచరులకు చెబుతుండేవాడు.

భగత్‌సింగ్ ప్రాపంచిక దృక్పథంలో హేతువాదం కీలకాంశంగా నిలిచింది. మతం, మానవ పరిణామం, సమాజ పరిణామం మొదలగు అంశాలను భగత్ శాస్త్రీయంగా విశ్లేషించేవాడు. అన్ని రకాల మూఢాచారాలను తీవ్రంగా నిరసించేవాడు. సమాజంలోని ప్రతీ అంశాన్ని హేతుబద్ధ ఆలోచనా సరళితో విశ్లేషించి అవగతం చేసుకోవాలని యువతకు బోధించే వాడు. స్వాతంత్ర్య సముపార్జన కోసం మిలిటెంట్‌గా ఉద్యమిస్తున్న తరుణంలోనే ప్రజల పోరాట శక్తిని బలహీనపరిచే మత రాజకీయాల దుష్ట స్వభావాన్ని భగత్‌సింగ్ స్పష్టంగా గుర్తించగలిగాడు.

మత రాజకీయాలను పూర్తిగా వ్యతిరేకించాలని తమ సంస్థ సభ్యులకు నిర్దేశించేవాడు. భగత్‌సింగ్ స్థాపించిన యువజన సంఘం 'నౌ జవాన్ భారత్ సభ'లో మతోన్మాద భావజాలమున్నవారికి ప్రవేశం నిషిద్ధం. మతాన్ని రాజకీయాల నుండి దూరంగా ఉంచాలని, ప్రజల్లో మత సామరస్యం పెంపొందించేలా సభ్యులు కృషి చేయాలని సంఘం నియమావళిలో పొందుపర్చారు. తాము ఎంతగానో ఆరాధించిన లజపతిరాయ్.. ఒక దశలో మత రాజకీయాలకు పాల్పడినప్పుడు భగత్‌సింగ్...తమ గురువునే ఎదిరించాడు.

సహాయ నిరాకరణ ఉద్యమం ఉపసంహరణ తర్వాత లజపతిరాయ్ క్రమంగా మతవాద రాజకీయాల వైపు మరలాడు. 1924 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేసినప్పుడు తమ గురువును, ఆయన మత రాజ కీయాలనూ ఓడించాలంటూ భగత్‌సింగ్, అతని సహచరులు ప్రచారం చేశారు. లాలా లజపత్ రాయ్ అవకాశవాద వైఖరిని ఎండగడుతూ "దారి తప్పిన నాయకుడు" పేరుతో ఒక కరపత్రం విడుదల చేసారు. పత్రికల వాళ్లు ప్రశ్నించినపుడు.. "కానీయనివ్వండి, వారెవ్వరో కాదు.. మేరే నాలాయక్ బేటేహై!" అని సమాధానమిచ్చాడట లజపతిరాయ్. మత రాజకీయాలను భగత్‌సింగ్ ఎంత తీవ్రంగా వ్యతిరేకించాడో.. ఈ సంఘటన రుజువు చేస్తుంది.

పైన ఉదహరించిన 'కీర్తి' పత్రిక వ్యాసంలోనే.. "ప్రజల మధ్య అనవసర గొడవలు నిరోధించడానికి.. ప్రజల్లో శ్రామిక వర్గ ఐక్యతను, అసలు సమస్యలపై ఉద్యమించే చైతన్యాన్ని పెంపొందించడం చాలా అవసరం" అని భగత్‌సింగ్ స్పష్టీకరించాడు. వలసవాద సంకెళ్లను ఛేదించడం కోసం మతం, కులం మొదలైన విభజనలకు అతీతంగా ప్రజల ఐక్యతను సాధించాలి. కలకత్తా నగరంలో మత ఘర్షణలను అడ్డుకోవడానికి.. హిందూ, ముస్లిం వర్గాల కార్మికులు చేతులు కలిపి, మతోన్మాదులను ఐక్యంగా ఎదుర్కొన్న వైనాన్ని ఉదహరించిన ఆయన.. సామాజిక విభజనలను అధిగమించిన శ్రామికవర్గ చైతన్యం తోనే ప్రజల ఐక్యత సాధ్యమని ఆయన తేల్చిచెప్పాడు. గదర్ వీరులు మతాన్ని రాజకీయాల నుండి వేరు చేసి, మతాన్ని వ్యక్తిగత అంశంగా పరిగణించారని.. మతోన్మాద ప్రమాదాన్ని నిలువరించడానికి ఇదే సమర్థవంతమైన పరిష్కారమని భగత్‌సింగ్ పేర్కొన్నాడు. "వలసవాదం లాగా మతతత్వం సైతం దేశ ప్రజలకు పెద్ద శత్రువు" అంటూ తన సహచరులకు చెబుతుండేవాడు.

కానీ నేడు దేశంలో ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు విశృంఖలంగా కొనసాగుతున్నాయి. కోట్లాది మంది సామాన్య ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిన పాలకులు కొద్దిమంది పెట్టుబడిదారుల సేవలో తరిస్తున్నారు. వీటిని చూస్తుంటే షహీద్ భగత్‌సింగ్ కలలుగన్న సమసమాజం ఈ దేశంలో ఇంకా అందనంత దూరంలోనే ఉండిపోయిందని అర్థమవుతోంది. స్వాతంత్ర్య సమర వీరులు కలలుగన్న సమ సమాజాన్ని నిర్మించడానికి.. షహీద్ భగత్‌సింగ్ తాత్విక చింతనను, ఆయన ఆశయాలను కొనసాగించడమే సరైన పరిష్కారం.

**(నేడు షహీద్ భగత్‌సింగ్ జయంతి)**

**/ వ్యాసకర్త సెల్: 9440443183/**

జనవాక్యం

## సామాన్యుడి కోసం రైళ్లేవీ!

ఈ మధ్య ప్రధాని మోడీ కొత్త కొత్త రైళ్లను ప్రారంభిస్తున్నారు. సామాన్య ప్రయాణికులు ఇబ్బందులు పడుతు న్నారు, అందుకోసం అనుకుంటే పొరపాటే! అన్నీ కూడా ఏసీ రైళ్ళే. సామాన్యుడు వాటి దరిదాపులకు కూడా పోడు. మరి ఎవరికోసం ఈ వందేభారత్ రైళ్ళు? ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు మాత్రమే ఎక్కుతుంటారు. వ్యాపారస్తులు తప్ప అందరూ ఖర్చు పెట్టేది ప్రజాధనమే! వ్యాపారస్తులకు డబ్బు లెక్క వుండదు. మరి ఈ వందేభారత్ రైళ్ళు ఎవరికోసం వేస్తున్నట్లు? కరోనా వచ్చిందని పాసెంజర్ రైళ్లన్నింటిని రద్దు చేశారు మోడీ. పోనీ తరువాత వాటిని పునరుద్ధరించారా! లేదు. ఆ పాసెంజర్ రైళ్ల స్థానంలో 'స్పెషల్ రైళ్ళు' అంటు కొత్తకొత్త పేర్లతో రైళ్లు వేశాడు. కరోనా వచ్చింది, దేశం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని, సీనియర్ సిటిజన్లకి రైళ్లలో ఇచ్చే రాయితీ తొలగించారు. మరి ఎంపీలకీ, ఎమ్మెల్యేలకి రాయితీలు ఎందుకు తొలగించలేదు? తొలగిస్తే అందరికి తీసివెయ్యాలికదా! సామాన్యుడి మీద ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం జాలి, దయ లేదన్నది స్పష్టమౌతుంది. ఈ కొత్త రైళ్ళన్నీ కూడా ఏసీ రైళ్ళు. సామన్యుడు వీటి ముఖం కూడా చూడలేదు. కనుక ఇప్పటికైనా సీనియర్ సిటిజన్లకి రైళ్లలో ఇచ్చే 33 శాతం రాయితీ పునరుద్ధరించాలి. పాసెంజర్ రైళ్ళను కొనసాగించాలి. ప్రతి ఎక్స్‌ప్రెస్ రైళ్లలోను సగం జనరల్ బోగీలు తగిలించాలి. అపుడు మాత్రమే సామాన్యుడికి రైళ్ల వలన ప్రయోజనం ఉంటుంది.

**- నార్నె వెంకట సుబ్బయ్య.**

**మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.**
**పంపాల్సిన మెయిల్ :**
editpageps@ gmail.com

# మణిపూర్‌లో 'సైనిక ప్రత్యేక అధికారాలు' పొడిగింపు

- విద్యార్థుల హత్యపై కొనసాగుతున్న నిరసనలు

**ఇంఫాల్:** మణిపూర్‌లో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా వెలుగులోకి వచ్చిన విద్యార్థుల హత్య దృశ్యాలతో.. రాష్ట్రంలో మరోసారి నిరసనలు పెల్లుబికాయి. పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో 9 పోలీస్ స్టేషన్ల పరిధి మినహా దాదాపు రాష్ట్రమంతటా సైనిక దళాలు (ప్రత్యేక అధికారాలు) చట్టం 1958 (ఎఎఫ్ఎస్‌పిఎ)ను అక్టోబర్ 1 నుంచి మరో ఆరు నెలలు పాటు పొడిగిస్తున్నట్లు మణిపూర్ ప్రభుత్వం ప్రకటించింది.

జులైలో అదృశ్యమైన ఇద్దరు విద్యార్థులు దారుణ హత్యకు సోమవారం వెల్లడయింది. వీరి మృత దేహాల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రాష్ట్రంలో మరోసారి నిరసనలు చోటుచేసుకున్నాయి. ఈ హత్యలను ఖండిస్తూ విద్యార్థులు బుధవారం కూడా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఇంఫాల్ ముఖ్యమంత్రి నివాసానికి సమీపంలో నిరసనకు దిగారు. ఈ క్రమంలోనే పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చెలరేగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు నిరసనకారులపై లాఠీఛార్జ్ చేశారు. భాష్పవాయువు ప్రయోగించి వారిని చెదరగొట్టారు. ఈ ఘర్షణల్లో పలువురు గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

దీంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం మొత్తం 'కల్లోలం'గా ఉందని ప్రకటించిన ప్రభుత్వం ఎఎఫ్ఎస్‌పిఎను పొడిగిస్తున్నట్లు తెలిపింది. 19 పోలీసు స్టేషన్ల పరిధులు మినహా.. రాష్ట్రవ్యాప్తంగా ఈ చట్టం అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబరు 1వ తేదీ నుంచి ఆరు నెలల పాటు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని వెల్లడించింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఇంటర్నెట్‌సేవల్ని సైతం నిలిపివేశారు.

ఈ చట్టం అమల్లో ఉన్న ప్రాంతాల్లో భద్రతా బలగాలకు విశేషాధికారాలు లభిస్తాయి. వారంట్ లేకుండా వారు ఎక్కడైనా సోదాలు నిర్వహించొచ్చు. ఎవరినైనా అరెస్ట్ చేయొచ్చు. ఈ క్రమంలో సైనికులు ఎవరిని కాల్చి చంపినా.. వారిపై ఎలాంటి విచారణ జరగదు. ఈశాన్య రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కొన్నేళ్లుగా ఈ చట్టం అమల్లో ఉండగా.. గతేడాది మణిపూర్‌లో ఈ చట్ట పరిధిని కుదించారు. మళ్లీ పరిస్థితులు ఉద్రిక్తతంగా మారడంతో పరిధిని విస్తరించి, పొడిగించారు.

### రాష్ట్రానికి సిబిఐ బృందం : సిఎం బిరేన్ సింగ్

జూలైలో అదృశ్యమై మరణించిన ఇద్దరు విద్యార్థుల హత్య కేసును దర్యాప్తు చేసేందుకు సిబిఐ బృందం మణిపూర్‌కు చేరుకుందని ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ బుధవారం ప్రకటించారు. సిబిఐ ప్రత్యేక డైరెక్టర్ అజయ్ భట్నాగర్ సారథ్యంలోని బృందం దర్యాప్తు ప్రారంభించిందన్నారు. బుధవారం మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ విషయాన్ని తెలిపారు. అయితే, సిబిఐ బృందం ఎక్కడికి వెళ్లి దర్యాప్తు చేస్తోందనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు.

### అసమర్థ ముఖ్యమంత్రిని తొలగించడమే మొదటి అడుగు : ఖర్గే

మణిపూర్‌లో పరిస్థితిపై కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే బుధవారం ప్రధాని నరేంద్ర మోడీపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పరిస్థితిని నియంత్రించడానికి బిజెపి "అసమర్థ" ముఖ్యమంత్రిని తొలగించడమే మొదటి అడుగుగా పేర్కొన్నారు. ఈ మేరకు ఖర్గే ట్వీట్ చేశారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై హింసను ఆయుధాలుగా మార్చుకున్నారని, మణిపూర్‌ను బిజెపి రణరంగంగా మారుస్తోందని ఆరోపించారు.

'147 రోజులుగా, మణిపూర్ ప్రజలు బాధపడుతున్నారు, కానీ ప్రధాని మోడీకి రాష్ట్రాన్ని సందర్శించడానికి సమయం లేదు. ఈ హింసకాండలో విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్న భయానక చిత్రాలు మరోసారి యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి' అని ఖర్గే ట్వీట్ చేశారు. అందమైన మణిపూర్ రాష్ట్రాన్ని రణరంగంగా మార్చిందని, దీనికి కారణం బిజెపి ఆయన అన్నారు. అసమర్థ ముఖ్యమంత్రిని తొలగించడమే రాష్ట్రంలో పరిస్థితిని చక్కదిద్దడానికి ముందు అడుగు అని ఖర్గే ట్వీట్ చేశారు.

## ట్విట్టర్‌లో తప్పుడు సమాచారాన్ని రిపోర్ట్ చేసే ఫీచర్ తొలగింపు !

**న్యూఢిల్లీ :** తప్పుడు సమాచారాన్ని కలిగివున్న ట్వీట్‌పై చర్యలు తీసుకోవాలంటూ వ్యక్తులు రిపోర్ట్ చేసే సామర్థ్యాన్ని ట్విట్టర్ కంపెనీ తొలగించింది. ఆస్ట్రేలియాలో పార్లమెంట్‌లో ఆదివాసీల గళం అన్న అంశంపై రిఫరెండం జరగడానికి కొద్ది వారాల ముందుగా ఈ చర్య తీసుకుంది.

2021 ఆగస్టు వరకు అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియాల్లో మాత్రమే ఇలా రిపోర్టు చేయగల సౌలభ్యం అందుబాటులో వుండేది, ఆ తర్వాత 2022 ప్రారంభంలో బ్రెజిల్, ఫిలిప్పీన్స్, స్పెయిన్‌లకు కూడా విస్తరించారు. ఎన్నికల సమయంలో ఇటువంటి సాధనం యొక్క ప్రాముఖ్యతను కంపెనీ గమనంలోకి తీసుకోవడంతో ఆ దేశాల్లో కూడా అమలు చేశారు. కానీ ఇప్పుడు గత ఒకటి రెండు వారాల్లో ఆయా దేశాల నుండి ఈ టూల్‌ను తొలగించారని డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ క్రిటిక్ గ్రూప్ రీసెట్ ఆస్ట్రేలియా పేర్కొంది. ఆస్ట్రేలియాలో రిఫరెండం జరగడానికి కొద్ది వారాల ముందుగా ఈ చర్య తీసుకోవడం ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. ఉద్దేశపూర్వకంగానే ఈ టూల్‌ను తొలగించినట్లైతే ఆస్ట్రేలియా ఎన్నికల సమగ్రత దెబ్బతింటుందని పేర్కొంది. దీనిపై ట్విట్టర్‌ను సంప్రదించగా, బిజీగా ఉన్నాం, తర్వాత సంప్రదించాలంటూ ఆటో రిప్లై వచ్చింది.

## దేశంలో డెంగీ విజృంభణ

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఇటీవల డెంగీ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక, చత్తీస్‌గఢ్, తెలంగాణ, గుజరాత్‌తోపాటు మరికొన్ని రాష్ట్రాల్లోనూ డెంగీ కలకలం సృష్టిస్తుంది. దీంతో రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం.. అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ప్రస్తుత పరిస్థితులు, సంసిద్ధతపై ఉన్నతాధికారులతో సమీక్ష జరిపిన కేంద్ర ఆరోగ్యశాఖ.. డెంగీ నివారణ, నిర్మూలన చర్యలు పటిష్ఠం చేయాలని అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించింది.దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు 95వేల డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం. 91 డెంగీ సంబంధిత మరణాలు చోటుచేసుకున్నాయి.

## సీనియర్ జర్నలిస్టు ఆనంద్‌కుమార్ మృతి

**న్యూఢిల్లీ :** సీనియర్ జర్నలిస్టుగా న్యూఢిల్లీలో సుదీర్ఘ కాలంగా పలు తెలుగు, ఇంగ్లీష్ దినపత్రికల్లో పనిచేసిన యు ఆనంద్ కుమార్ మంగళవారం మృతి చెందారు. 61 ఏళ్ల ఆనంద్‌కుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఆనంద్‌కుమార్ ప్రస్తుతం న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మీడియా కోర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఢిల్లీ జెఎన్‌యులో చదివిన ఆనంద్‌కుమార్ తరువాత జర్నలిజం వృత్తిలోకి ప్రవేశించారు. ఆనంద్‌కుమార్ మృతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆనంద్‌కుమార్ మృతి వార్త దిగ్భ్రాంతి కలిగించిందని చెప్పారు.

### ఎపిడబ్ల్యుజెఎఫ్ సంతాపం

సీనియర్ జర్నలిస్టు యు ఆనంద్ కుమార్ మృతి చెందడం పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్లు సంతాపం ప్రకటించాయి. ఈ మేరకు ఎన్ కొండయ్య, ఎ అమరయ్య (ఎన్ఎజె), ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు (ఎపిడబ్ల్యుజెఎఫ్), వి శ్రీనివాసరావు, కె మునిరాజు (ఎపిబిజెఎ) బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యూఢిల్లీ వెళ్లిన జర్నలిస్టు మిత్రులకు సహాయ సహకారాలు అందించడంలో ఆనంద్‌కుమార్ తోడ్పాటు అందించేవారని పేర్కొన్నారు. .

## ఇరాక్‌లో అగ్నిప్రమాదం

- 114మంది మృతి

**బాగ్దాద్ :** ఇరాక్‌లో దారుణం చోటు చేసుకుంది. వివాహ వేడుక జరుగుతున్న ఫంక్షన్ హాల్‌లో పెద్ద అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 114మంది మరణించగా, 200మందికి పైగా గాయపడ్డారని ఇరాక్ ఉత్తర ప్రాంత ప్రావిన్స్ అయిన నినెవా గవర్నర్ నజ్మ్ అల్ జుబోరి బుధవారం తెలిపారు. ఆ ప్రావిన్స్‌లోని అల్ హమ్‌దనియా పట్టణంలో ఈ విషాదం సంభవించింది. ప్రావిన్స్ రాజధాని మోసుల్‌కు అగ్నేయంగా 35కిలోమీటర్ల దూరంలో అల్ హమ్‌దనియా పట్టణంలో మంగళవారం రాత్రి మంటలు చెలరేగాయని అధికార వార్తా సంస్థ ఐఎన్ఎ తెలిపింది.

# బిల్లులను తొక్కిపడుతున్న గవర్నరు

- కేరళ ముఖ్యమంత్రి విజయన్ ఆందోళన
- సుప్రీంకు వెళ్తామని వెల్లడి

**తిరువనంతపురం:** రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన 8 బిల్లులను రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ ఆమోదానికి పంపి, చాలా కాలం అయినా ఇంతవరకు వాటిపై సంతకం చేయలేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, .

ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించేలా శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నరు తొక్కిపట్టడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని అన్నారు. బిల్లులకు సంబంధించి గవర్నర్ కోరిన వివరణలను సంబంధిత మంత్రులు, అధికారులు ఇచ్చారు. అయినా, ఈ బిలులపై గవర్నరు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నాన్చుతున్నారని ఆయన అన్నారు..యుజిసి నిబంధనల ప్రకారం కేరళలో యూనివర్సిటీ చట్టాల ఏకీకరణకు సంబంధించిన బిల్లుకు ఇంతవరకు మోక్షం లభించలేదు. ఈ కారణంగా యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్ల నియామకం నిలిచిపోయింది.కేరళ పబ్లిక్ హెల్త్ బిల్లును కూడా తొక్కిపట్టారు. గవర్నర్ తనకు విచక్షణాధికారాలు ఉన్న వాటిలో మినహా మిగతావాటిలో ఎన్నికైన ప్రభుత్వాల సలహాలు, సహకారంతో వ్యవహరించాలని రాజ్యాంగ పరిషత్తులో చర్చలు స్పష్టం చేస్తున్నాయి. వలస ప్రభుత్వ పాలనలో ప్రాంతీయ ప్రభుత్వాలు విస్తత విచక్షణాధికారాలను కలిగి ఉండేవి. 1937లో, అప్పటి భారత ప్రభుత్వ చట్టం 1935 ప్రకారం ప్రావిన్సులలో ఎన్నికలు జరిగినప్పుడు, భారత జాతీయ కాంగ్రెస్ 5 ప్రావిన్సులలో మెజారిటీ సాధించింది. అయినప్పటికీ, మహాత్మా గాంధీతో సహా జాతీయ నాయకులు గవర్నర్‌లకు ఇచ్చిన విస్తతమైన విచక్షణ అధికారాలను తొలగించాలని పట్టుబట్టారు ప్రావిన్సులలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడానికి నిరాకరించారు. భారత ప్రభుత్వ చట్టాన్ని సవరించనప్పటికీ, గవర్నర్ల విస్తత విచక్షణాధికారాలు ఉపయోగించబడవని అప్పటి వైస్రాయ్ లిన్లిత్‌గో మౌఖికంగా హామీ ఇచ్చిన తరువాతే ప్రావిన్సులలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు.

స్వాతంత్ర్యానంతర భారతదేశం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ఆమోదం లేకుండా శాసనసభ ఆమోదించిన బిల్లులను దీర్ఘకాలికంగా నిలుపుదల చేయడం వలసవాద యుగాన్ని గుర్తుకు తెస్తుందని విజయన్ విమర్శించారు. సాధారణ చట్టాల ఆమోదం ఆలస్యం చేయడం వల్ల ప్రజలకు బాధ్యత వహించే ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ, తమిళనాడు సహా ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఈ అంశాన్ని లేవనెత్తుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన మార్గాలను అన్వేషించడం మినహా మరో మార్గం లేదని ఆయన అన్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టే అధికారం గవర్నర్‌కు ఉందా అనే అంశంపై ప్రభుత్వం సీనియర్ న్యాయవాది ఫాలి ఎస్ నారిమన్ అభిప్రాయాన్ని కోరినట్లు తెలిపారు.

### 2025 నవంబరు నాటికి తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా కేరళ

2025 నవంబర్ 1 నాటికి కేరళను తీవ్ర పేదరికం నుండి విముక్తి చేయడమే తమ లక్ష్యమని కేరళ ముఖ్యమంత్రి విజయన్ ప్రకటించారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోందన్నారు.

ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, సకాలంలో ప్రాజెక్టుల అమలుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. చెత్త వేయకుండా సహకరిస్తామని బహిరంగ కార్యక్రమాల్లో ప్రతిజ్ఞ చేయాలని బుధవారం జరిగిన కేబినెట్ సమావేశం నిర్ణయించిందని విజయన్ తెలిపారు..

# తప్పు చేశా ...తప్పుకుంటున్నా !

- రాజీనామా చేసిన కెనడా స్పీకర్
- పార్లమెంటులో మాజీ నాజీ సైనికునికి సత్కారంపై సర్వత్రా విమర్శలు
- హుంకాను తమకు అప్పగించండన్న పోలండ్

**ఒట్టావా, వార్సా :** తాను తప్పు చేశానని, అందుకే పదవి నుండి తప్పుకుంటున్నానని కెనడా స్పీకర్ ఆంథోనీ రోటా మంగళవారం ప్రకటించారు. గత వారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కెనడా పర్యటన సందర్భంగా 98ఏళ్ళ నాజీ మాజీ సైనికుడు యరొస్లావ్ హుంకాను గ్యాలరీలో కూర్చోవాల్సిందిగా ఆహ్వానించి పొరపాటు చేసినట్లు ఆయన అంగీకరించారు. పైగా హుంకా వచ్చే సమయంలో ప్రధాని జస్టిన్ ట్రూడే సహా కెనడా పార్లమెంట్ సభ్యులందరూ రెండుసార్లు లేచి స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఆ తర్వాత హుంకాను యుద్ధ వీరుడిగా ప్రశంసిస్తూ రోటా సమావేశంలో మాట్లాడారు. హుంకా ఉక్రెనియన్ నాజీ డివిజన్‌లో భాగమని, అటువంటి వ్యక్తిని పార్లమెంటుకు పిలిచి ఎలా సత్కరిస్తారని పలువురు ప్రశ్నించారు. దీంతో అధ్యక్షుడు ట్రూడో తీవ్ర ఇరకాటంలో పడ్డారు. ఆయనను కాపాడేందుకు స్పీకర్ తప్పంతా తన మీద వేసుకున్నారు. నాజీ సైనికుడికి సత్కారం దారుణమైన చర్యగా రష్యా అభివర్ణించింది. కెనడాతో సహా ప్రపంచవ్యాప్తంగా గల యూదులందరికీ, ఇతర వ్యక్తులు, కమ్యూనిటీలకు ఈ చర్య చాలా బాధను కలిగించిందని, ఆ విషయం తనకు అర్థమైందని రోటా చెప్పారు.

### హుంకాను మాకు అప్పగించండి: పోలండ్

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఉక్రెనియన్ నాజీ డివిజన్‌లో పోషించిన పాత్రపై దర్యాప్తు చేయడానికి గాను యరొస్లావ్ హుంకాను తమకు అప్పగించాలని పోలండ్ కోరింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కెనడా పార్లమెంట్ సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా, గ్యాలరీలో కూర్చునేందుకు హుంకాను కెనడా పార్లమెంట్ స్పీకర్ ఆంథోనీ రోటా ఆహ్వానించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో పోలెండ్ జాతీయులను, యూదులను ఊచకోత కోయడంలో ఈ డివిజన్ కీలక పాత్ర పోషించింది. తనకు హుంకా గతం గురించి తెలియదని, అందుకే ఆహ్వానించానని స్పీకర్ చెప్పారు. అయినా, ఆగ్రహం చల్లారకపోవడంతో స్పీకర్ పదవి నుంచి తప్పుకున్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలని విజయవాడ లెనిన్ సెంటర్‌లో నినదిస్తున్న వామపక్ష నేతలు

మహిళా కార్యకర్తను పట్టుకుని తోస్తున్న కాకినాడ త్రీ టౌన్ సిఐ భగవాన్

# విద్యుత్ భారాలపై దద్దరిల్లిన కలెక్టరేట్లు

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ విద్యుత్ ప్రయివేటీకరణను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారా రైతులు ఉచిత విద్యుత్ సాధించుకున్నారని తెలిపారు. విద్యుత్ రంగ సంస్థలను బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టాలని పాలకులు చూస్తున్నారని, ప్రయివేట్ పెట్టుబడులకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. దీనివల్ల వినియోగదారులపై మరింత భారాలు పడతాయని, రైతులకు ఉచిత విద్యుత్ అందదని, విద్యుత్ రాయితీలు రద్దవుతాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ అడుగులకు మడుగులొత్తుతూ ముఖ్యమంత్రి జగన్‌హన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలో అమలు చేస్తూ ప్రజలపై మోయలేదని భారాలు మోపుతున్నారని అన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు.

విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల బిల్లుపై వైసిపి, టిడిపి తమ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగితే ఛార్జీలు తగ్గాలని, కానీ విద్యుత్ రంగంలో మాత్రం పెరుగుతున్నాయని తెలిపారు. స్మార్ట్ మీటర్ల కొనుగోలుపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు షాక్ ఇస్తున్న వైసిపి ప్రభుత్వానికి ప్రజలూ రాజకీయంగా 'షాక్' ఇస్తారన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె.ఖాదర్‌బాషా, సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జి.ఓబులేసు, అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలోని అంబేద్కర్ సెంటర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వామపక్ష శ్రేణులపై డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి అసభ్యపదజాలంతో విరుచుకుపడ్డారు. మహిళలని కూడా చూడకుండా రెచ్చిపోయారు. నిరసన తెలుపుతున్న వారిలో కొందరిని ఈడ్చుకుంటూ తీసుకెళ్లి బలవంతంగా పోలీస్ వ్యాన్ ఎక్కించి స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో, మిగిలిన వారు ఈ వ్యాన్‌ను అడ్డుకున్నారు. వారిపైనా పోలీసులు జులుం ప్రదర్శించి అరెస్టులకు పాల్పడ్డారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న మహిళా నాయకులపైనా, కార్యకర్తలపైనా దురుసుగా వ్యవహరించారు. త్రీటౌన్ సిఐ భగవాన్ మహిళలను బలవంతంగా లాక్కెళ్లి పోలీసు వాహనంలో ఎక్కించారు. వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులను మొత్తం 25 మందిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత వారిని విడుదల చేశారు. విశాఖలో ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ధర్నా చేశారు. అనంతరం ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ బి.రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, అమలాపురం, ఏలూరు, గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, ఒంగోలు, కడప, తిరుపతి, చిత్తూరు, కర్నూలు, నంద్యాలల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నా చేశారు. అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శ్యామలా సెంటర్‌లో, అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, మదనపల్లెలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట, అనంతపురంలోని పవర్ ఆఫీసు వద్ద, శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్లో నిరసన తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు

నెం.95 మరియు 96/23-24 తేది:25.09.2023

డ్రైనేజి డివిజన్, గుడివాడ పరిధిలో 2023-24సం॥నకు యం.పిలాడ్స్ మరియు స్టేట్ ఫండ్స్ క్రింద 2 పనులు చేపట్టుటకు గాను రూ.34.40 లక్షలతో టెండర్లు కోరడమైనది. టెండర్లను 02.10.2023, ఉ.11గం. నుండి 16.10.2023, సా.5గం. వరకు దాఖలు చేయవచ్చు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in లో పొందగలరు. ఫోన్ నం. 9440343540.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు,
డ్రైనేజి డివిజన్, గుడివాడ

DIPRNo.11071/CL/ADVT/1/1/2021-22

यूनियन बैंक ऑफ इंडिया
भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయము, మచిలీపట్నం.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపినను తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం **ది. 11-10-2023, బుధవారం సా॥ 4.00 గంటలకు బ్రాంచి ఆవరణలో బహిరంగవేలం వేయబడును.** వేలం వేసినా బకాయి రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారు ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

| వ. సం. | ఖాతా నెం. | ఋణగ్రహీత పేరు | స్థూల బరువు (గ్రాములలో) |
|---|---|---|---|
| | | **చిన్నాపురం బ్రాంచి** | |
| 1. | 078330100138726 | గోవాడ కృష్ణ, తండ్రి : శ్రీరాములు, డి.నెం. 9-4, అంబేద్కర్ విగ్రహం దగ్గర, చిన్నాపురం, కృష్ణ, ఎపి. | 64.00 |
| | | **యు.యం.ఎఫ్.బి. గుడివాడ** | |
| 1. | 014616540001130 | గుల్లపూడి బాబూరావు, డి.నెం. 4-198, లక్ష్మి నరసింహపురం, నందివాడ (మం) కృష్ణా జిల్లా, ఎపి. | 186.00 |
| 2. | 014616540001131 | | 130.00 |
| | | **పోరంకి** | |
| 1. | 330006540218040 | షేక్ ఖాజాబీ, భర్త : మాభు సుభాని, డి.నెం. 4-127, కార్మికనగర్ కట్ట, తాడిగడప - 521137 | 22.20 |
| 2. | 330006540218134 | | 10.00 |
| | | **ఉయ్యూరు, కాటూరు రోడ్డు** | |
| 1. | 639606540009865 | కల్లిశెట్టి లక్ష్మి, డి.నెం. 2-175/2, సుందరంపేట, 2వ వార్డు, ఉయ్యూరు | 9.00 |
| 2. | 639606540008228 | మండవ సురేంద్రనాథ్ బెనర్జీ, డి.నెం. 1-78-2, శివపురం, వెంట్రప్రగడ, పెదపారుపూడి మండలం, కృష్ణా జిల్లా, ఎపి. | 55.00 |
| 3. | 639606540011298 | దేవు పద్మావతి, ఫ్లాట్ నెం. 301, సాయిసుధ అపార్ట్‌మెంట్, హెూమియో కాలేజి ఎదురుగా, ఏలూరు రోడ్డు, గుడివాడ, | 40.00 |

షరతులు : 1) వేలంలో పాల్గొనువారు **రూ. 5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే)** ధరావత్తు చెల్లించవలెను. 2) వేలంలో ఆభరణములు పొందినవారు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో ఆభరణములు పొందని వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. 3) ఏ స్థితిలోనైనా వేలం నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 4) వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 5) వేలంలో పాల్గొను వారు ఆధార్ మరియు పాన్‌కార్డు కాపీలను సమకూర్చవలెను.

ది. 27-09-2023 సం/- అధీకృత అధికారి

ఫారం నెం.14 (రెగ్యులేషన్ 33(2) చూడవలెను)

సత్యమేవ జయతే
రికవరీ ఆఫీసర్ వారి కార్యాలయం-I
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
(ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము)
31-31-21, నారాయణ భవనం, సాయి బాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం - 530020.

డిమాండ్ నోటీసు

అప్పులు & దివాలా చట్టం 1993 నందలి రికవరీ సెక్షన్ 25 నుండి 28 వరకు మరియు ఆదాయపు పన్ను చట్టం 1961 నందలి రెండవ షెడ్యూలు 2వ నియమము ప్రకారం

RC/1013/2017 08.09.2023

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, పార్క్ రోడ్డు, విజయవాడ, కృష్ణా జిల్లా
వర్సెస్
మెస్సర్స్ రామ ఇండస్ట్రీస్ & ఇతరులు

దిగువ వారికి
(సిడి-1) మెస్సర్స్ రామ ఇండస్ట్రీస్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ఏకైక ప్రొప్రయిటర్ **శ్రీ యు. వెంకటేశ్వర రావు,** ప్లాట్ నెం.216, కొండపల్లి, IALA కొండపల్లి గ్రామం, కృష్ణా జిల్లా.
(సిడి-2) **శ్రీ యు. వెంకటేశ్వర రావు, తండ్రి. శ్రీ యు. శేషగిరి రావు,** డి.నెం.SF-4, మహేశ్వరి టవర్స్, వెస్ట్ ఇబ్రహీంపట్నం, విజయవాడ, కృష్ణా జిల్లా.

జారీ చేయబడిన రికవరీ సర్టిఫికేట్ దృష్ట్యా గౌరవనీయ ప్రెసిడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం ద్వారా **తేది.18.04.2017** నందు **O.A. No.660 of 2014** ఆమోదించబడింది. మొత్తం **రూ.1,06,66,476/- (అక్షరాల ఒక కోటి ఆరు లక్షల అరవై ఆరు వేల నాలుగు వందల డెబ్బై ఆరు రూపాయలు మాత్రమే) మైనస్ రూ.1,49,000/- (తేది.10.06.2015 న పాక్షిక సంతృప్తి ద్వారా స్వీకరించబడినది)** పెండెంటెలైట్ మరియు భవిష్య వడ్డీతో పాటు వడ్డీతో నెలవారీ వడ్డీ @ 13.25% పైన పేర్కొన్న మొత్తంపై **తేది.17.11.2014** నుండి రియలైజ్ అయ్యే వరకు / రూ.1,54,005/- ఖర్చులతో చెల్లింపు తేదీ వరకు చెల్లించాల్సి ఉంటుంది. (పూర్తిగా / పరిమితంగా)

2. మీరు ఈ నోటీసు అందుకున్న తేది నుండి 15 రోజుల లోపు మొత్తం చెల్లించవలసి ఉంటుంది. లేని యెడల "బ్యాంకు మరియు ఆర్థిక సంస్థల" చట్టం ప్రకారం ఋణాల రికవరీలోని 1993 నియమము ప్రకారం వసూలు చేయబడుతుందని ఆదేశించడమైనది.
3. దీని ప్రకారము మీరు కలిగియున్న ఆస్తుల మొత్తం వివరాలను అఫిడవిట్‌లో ప్రకటించాలని ఆదేశించడమైనది.
4. పై ఆదేశానుసారం, **తేది.09.10.2023 ఉదయం గం.10.30 ని.లకు** తదుపరి చర్యలు నిమిత్తం ఆదేశించిన అధికారి వారి ముందు హాజరవ్వాలని ఆదేశించడమైనది.
5. పైన పేర్కొన్న మొత్తానికి అదనంగా మీరు నిబంధనల ప్రకారం ఈ క్రింది విధంగా చెల్లించవలసి ఉంటుంది.
ఎ) ప్రొసీడింగ్ ప్రకారం జారీ చేయబడిన నోటీసు తేది తరువాత నుండి అయ్యే ఖర్చులు గాని, విధించబడే వడ్డీలు గానిన అదనంగా వసూలు చేయబడుతుంది.
బి) ఈ నోటీసు తయారీ, వారంట్ పంపుట (విడుదల) మరియు ఇతర సేవా ప్రక్రియలకు అయ్యే ఖర్చులు, ఛార్జీలు మీ వద్ద నుండి వసూలు చేయబడునని అని మీకు తెలియపరచడమైనది.

(నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది.08 సెప్టెంబరు 2023 న ఇవ్వబడినది)

(అవసరాల అనిల్)
రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
నల్లపాడు బ్రాంచి :
1-153, మెయిన్ రోడ్డు, నల్లపాడు - 522005, గుంటూరు జిల్లా

సంక్షిప్త డిమాండ్ నోటిసు

సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 3 (1) రూలుతో కూడిన సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 (SARFAESI చట్టం) యొక్క 13 (2) విభాగం ప్రకారం.

1) SARFAESI చట్టం ప్రకారం క్రింది సంతకందారు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి మరియు నియమావళి యొక్క 3వ నియమంతో కూడిన 13(12) విభాగం క్రింద సంక్రమించిన అధికారములతో సదరు చట్టం 13(2) విభాగం ప్రకారం దిగువ జాబితాలో పేర్కొనబడిన ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు (ఇప్పటి నుండి ఋణగ్రహీతలుగా పరిగణింప బడతారు)లు క్రింద తెలిపిన వివరాలు ప్రకారం నోటీసులో తెలుపబడిన మొత్తములను నోటీసు స్వీకరణ తేది నుండి 60 దినములలోగా చెల్లింపు చేయవలసినదిగా డిమాండ్ నోటీసు జారీ చేసినారు.

2) సదరు నోటిసులు బట్వాడా కాకుండా పోస్టల్ అధారిటీ వారిచే తిరిగి వచ్చినవి లేదా ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు స్వీకరించినట్లు ధృవీకరించలేదు. కనుక డిమాండ్ నోటిసు ప్రచురణను విస్తృతపరమైన హెచ్చరిక నిమిత్తం బ్యాంకు చేపట్టినది. దిగువ సంతకందారు పేర్కొన్న చట్టం ప్రకారం, పేర్కొన్న ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల యొక్క చిరునామా నందు చివరి సారిగా ఈ నోటీసులను అతికించినారు. సదరు నోటిసు కాపీలు దిగువ సంతకందారుని వద్ద లభిస్తాయి మరియు ఈ నోటిసు కాపీలను పొందగోరిన సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు దిగువ సంతకందారు నుండి ఏపనిదినమునైనా సాధారణ ఆఫీసువేళలలో పొందవచ్చును.

3) పై నేపధ్యం (అంశము) ఆధారంగా, ఈ నోటిసు ప్రచురణ తేది నుండి 60 దినములలోగా ఈ దిగువ సూచించిన మొత్తములు సదరు తేది నుండి ఋణం మరియు ఇతర డాక్యుమెంట్లు ప్రకారం చెల్లింపు చేయు తేది వరకు ఒప్పందపు రేట్ల ప్రకారం భవిష్యత్తు వడ్డీతో సహా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారికి చెల్లించవలసినదిగా సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు మరొకసారి ఈ ప్రకటన మూలముగా కోరటమైనది. ఋణబకాయిలు తిరిగి చెల్లింపు చేయు నిమిత్తం సెక్యూరిటిగా దిగువ తెలిపిన ఆస్తులను సంబంధిత ఋణగ్రహీతలు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారికి తనఖా పెట్టియున్నారు.

ఋణగ్రహీతలు / తనఖాదారులు పేర్లు మరియు చిరునామా

**ఋణగ్రహీత / తనఖాదారు : శ్రీ కటారి చరణ్ తేజ,** శాశ్వత చిరునామా : ఎ) శ్రీ కటారి చరణ్‌తేజ, తండ్రి : కటారి శ్రీనివాసరావు, డి.నెం. 4-151, పద్మావతి నగర్, పొదలకూరపల్లి, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు. **బి) శ్రీ కటారి చరణ్ తేజ,** డి.నెం. 1/2, ఆర్.అగ్రహారం, దగ్గరి డోర్ నెం. 25-16-118/1ఎ, ఫ్లాట్ నెం. 203, 2వ అంతస్తు, చతుర హోమ్స్, లాల్‌పురం రోడ్డు (విఐపి రోడ్డు), చుట్టుగుంట సెంటర్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు - 522004.
**బకాయి మొత్తం : రూ. 42,63,943/-** (అక్షరాల నలభై రెండు లక్షల అరవై మూడు వేల తొమ్మిది వందల నలభై మూడు రూపాయలు మాత్రమే) + ది. 28-07-2023 నుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు

సెక్యూర్డ్ ఆస్తుల వివరణ

గుంటూరు, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్, చుట్టుగుంట సెంటర్ (లాల్‌పురం రోడ్డు (వి.ఐ.పి.రోడ్డు), పాత అసిస్‌మెంట్ నెం. 61524/ఎ/14, కొత్త అసిస్‌మెంట్ నెం. 109724, ఆర్.అగ్రహారం డి.నెం. 1/2, కొత్త డోర్ నెం. 25-16-118/1ఎ వద్ద చతుర హోమ్స్ నందు రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 203. **స్థలమునకు హద్దులు : ఉత్తరం :** గొల్లవారి సత్రం ఆస్తి & షేక్ ఖాసి సాహెబ్ గారి ఆస్తి - 93.00, **దక్షిణం :** 30అ॥ వెడల్పు గల మున్సిపల్ కార్పోరేషన్ రోడ్డు - 135.00, **తూర్పు :** బొడ్డుపల్లి శివలింగయ్య గారి ఆస్తి - 77.00, **పడమర :** 60 అ॥ వెడల్పు లాల్‌పురం రోడ్డు - 83.00, (ప్రస్తుతం విఐపి రోడ్డు) **మరలా పడమర :** షేక్ ఖాసీం సాహెబ్ గారి ఆస్తి - 3.06, **మరలా ఉత్తరం :** గొల్లవారి సత్రం కి చెందిన ఆస్తి - 48.00. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** కామన్ కారిడార్, **పడమర :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము. **(అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 30 చ॥గ॥లు లేదా 25.08 చ॥మీ॥తో కలిపి 1079 చ॥గ॥లు లేదా 902.15 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి ప్లింత్ ఏరియా 1050 చ॥అ॥ (190 చ॥అ॥ కామన్ ఏరియాతో కలిపి) మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియా తో కలిపి స్టిల్ట్ ఫ్లోర్)**

**NPA తేది : 10-06-2023 డిమాండ్ నోటీసు తేది : 28-07-2023**

పైన తెలిపిన తేది నుండి చెల్లింపుచేయు తేది వరకు అంగీకరించిన ఒప్పందపు రేట్ల ప్రకారం తదుపరి వడ్డీ / మిగిలినవి చెల్లించాలి.

4) పైన చెప్పినట్లుగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారికి చెల్లింపు చేయుటలో సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు విఫలమైనచో, SARFAESI చట్టం 13(4) విభాగం మరియు సదరు నియమావళి ప్రకారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారు పై సెక్యూర్డ్ ఆస్తులపై తగు చర్యలు చేపట్టెదరు మరియు అందుకు ఎదురయ్యే అన్ని ఖర్చులు మరియు పరిణామములకు సదరు ఋణగ్రహీతలు / తనఖాదారులు బాధ్యులగురు.

5) ఇంకను తెలియపరుచునది ఏమనగా, చట్టంలోని 13వ విభాగంలోని ఉప విభాగం (8) నియమములు క్రింద లభించే సంబంధిత కాలం పరిధిలో తమ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవలసినదిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

6) అలాగే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వారి ముందస్తు లిఖిత అనుమతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా మార్గముల ద్వారా సెక్యూర్డ్ ఆస్తులను మీరు బదిలీ చేయుట SARFAESI చట్టం ప్రకారం నిషేధించటమైనది ఏ వ్యక్తి అయిన చట్టం లేదా నియమావళిలోని నియమాలను ఉల్లంఘించిన లేదా వ్యతిరేకతను ప్రోత్సహించిన సదరు చట్టంలోని 29వ విభాగం ప్రకారం జైలు శిక్షమరియు / లేదా జరిమానా విధించబడుతుంది.

తేది: 28-07-2023, స్థలం : గుంటూరు సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

## సంస్కారం

అనగనగా రాములవారి కోట అనే గ్రామంలో అనూష, బిందు స్నేహితులు. ఇద్దరూ ఒకే పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నారు. అనూష ఎప్పుడూ స్నేహితులతో గొడవ పడుతూ ఉండేది. పరీక్షలు దగ్గరికి వచ్చాయంటే మాత్రం అందరికీ చాక్లెట్లు, బిస్కెట్లు ఇస్తూ స్నేహం పెంచుకునేది. బిందు మాత్రం అలా కాదు. రోజూ బిందు, అనూష పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లేవారు.

ఓ రోజు దారిలో ఒక మర్రి చెట్టు కింద ఒక ముసలాయన కూర్చొని ఉన్నాడు. వీళ్ళిద్దరినీ చూసి 'తల్లులూ...ఇటు రండి' అని పిలిచాడు. బిందు అతని దగ్గరికి వెళ్లి 'ఏంటి తాతయ్యా' అని అడిగింది. 'కాస్త ఈ సీసాలో నీరు నింపి ఇవ్వమ్మా' అంటూ పక్కనే ఉన్న కుళాయి చూపించాడు. అప్పుడు అనూష 'ఒక పక్క స్కూలుకు లేటు అవుతుంటే నువ్వేంటి.. మంచినీళ్లు పట్టుకుంటూ కూర్చుంటావా?' అని విసుక్కుంటూ బిందును పట్టించుకోకుండా స్కూలుకు వెళ్లిపోయింది. బిందు మాత్రం తాతయ్య సీసాలో నీళ్లు నింపి ఇచ్చింది.

స్కూలుకు వచ్చిన బిందు దగ్గరికి అనూష పరుగెత్తుకుంటూ వెళ్లి 'చెట్టు కింద తాతయ్య ఊరికే ఉన్నాడు కదా! తన పని తను చేసుకుంటాడు. నువ్వు అనవసరంగా సాయం చేశావు' అన్నది. 'ఆ తాతయ్య నడవడానికే చాలా ఇబ్బంది పడిపోతున్నాడు. అందుకే నీరు పట్టి ఇచ్చాను' అని చెప్పి బిందు అక్కడి నుండి వెళ్లిపోయింది.

ఇది జరిగిన కొన్ని రోజులకు ఒకరోజు పాఠశాలకు ఆలస్యంగా బయలుదేరారు బిందు, అనూష. బాగా ఆలస్యమైపోయిందని పరిగెత్తుకుంటూ వెళ్లారు. మర్రిచెట్టు దగ్గరకి వచ్చేసరికి రాయి తగిలి అనూష కింద పడిపోయింది. కాలుకి బాగా దెబ్బ తగిలి రక్తం కారుతుంటే నొప్పితో లేవలేకపోయింది. ఇదంతా చూసిన చెట్టు కింద తాతయ్య వచ్చి తన ధోతిని చింపి కట్టుకట్టాడు. బిందు సాయంతో పక్కనే ఉన్న డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు.

హాస్పటల్ వరకు చాలా జాగ్రత్తగా అనూష చేయి పట్టుకుని నడిపించాడు తాతయ్య. కాలు నొప్పి కంటే ఆ తాతయ్య గురించి గతంలో తను అన్న మాటలు గుర్తుకువచ్చి, అనూషకు దుఃఖం ఆగలేదు. 'నన్ను క్షమించు తాతయ్య' అని అడిగింది. 'ఎందుకమ్మా ఈ చిన్న సాయానికే అంతలా కన్నీళ్లు పెట్టుకుంటావు. ఏం పర్లేదు' అని బుజ్జగించాడు తాతయ్య.

ఆ రోజు నుండి అనూష తన స్నేహితులతో గొడవలు పడటం మానేసింది. ఎవరికి ఏ అవసరం వచ్చినా వెంటనే సహాయం చేసేది. అనూషలో వచ్చిన మార్పును చూసి బిందు చాలా సంతోషించింది.

**- నరాలశెట్టి నిఖిత, 7వ తరగతి, మేళ్ళచెరువు, సూర్యాపేట జిల్లా.**

### నేను చేసిన బొమ్మలు

**సూరాబత్తుల క్రిషిక, 4వ తరగతి, కెసి హైస్కూల్, విజయవాడ.**

**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com**

## క్యూబాకు వెల్లువెత్తిన సంఘీభావం

**హవానా :** వాషింగ్టన్‌లోని క్యూబా దౌత్య కార్యాలయంపై ఆదివారం సాయంత్రం జరిగిన దాడిని పలు దేశాలు ఖండించాయి. ఈ విషయంలో క్యూబాకు అవి పూర్తి సంఘీభావం తెలియజేశాయి. చివరికి ఈ దాడికి పరోక్షంగా కారణమైన అమెరికా కూడా ఖండించక తప్పని స్థితి ఏర్పడింది. సోమవారం అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ మాట్లాడుతూ, వాషింగ్టన్‌లోని క్యూబా ఎంబసీపై దాడిని ఖండిస్తున్నామని చెప్పారు. సకాలంలో, సముచితమైన దర్యాప్తు చేపట్టేందుకు వీలుగా క్యూబా ఎంబసీ అధికారులతో, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో నిరంతరం మాట్లాడుతున్నామని తెలిపారు. వాషింగ్టన్ డిసి పోలీసులతో కలసి దర్యాప్తును సమన్వయం చేసుకుంటామని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ తెలిపారు.

ఇంతవరకు ఈ ఘటనకు సంబంధించి ఎవరినీ అరెస్టు చేయలేదని అమెరికా సీక్రెట్ సర్వీస్ తెలిపింది. సాధ్యమైనంత త్వరగా ఈ కేసు దర్యాప్తును ముగించి, బాధ్యులెవరో తేల్చి చర్యలు తీసుకోవాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ అమెరికాను కోరారు. లెబనాన్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి హన్నా ఘరీబ్ ఈ దాడిని ఖండించారు. విముక్తి చిహ్నంగా క్యూబాకు తమ మద్దతు ఎప్పుడూ వుంటుందని ఆయన ఉద్ఘాటించారు. విదేశీ ఎంబసీని రక్షించడంలో అమెరికా విఫలమైందని స్వీడిష్-క్యూబన్ సంఘీభావ సమాఖ్య విమర్శించింది. ఈ నేరానికి ఎవరూ శిక్ష పడకుండా తప్పించుకోరాదని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జకరోవా వ్యాఖ్యానించారు. ఈ దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

## బైజూస్‌లో వేలాది మందిపై వేటు..!

- కొత్త సిఇఒ ప్రణాళికలు



**న్యూఢిల్లీ :** కరోనా కాలంలో ఓ వెలుగు వెలిగిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ తీవ్ర ఆర్థిక కటకటను ఎదుర్కొంటుంది. పొదుపు చర్యల్లో భాగంగా ఇప్పటికే పలు దఫాలుగా ఉద్యోగులను తొలగించిన బైజూస్ మరోమారు వేలాది మంది సిబ్బందిని ఇంటికి పంపించే యోచనలో ఉందని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. బైజూస్ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) అర్జున్ మోహన్ నియామకం తర్వాత కొత్త ప్రణాళికలు వేస్తున్నారని సమాచారం. దాదాపుగా 4000 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నారని తెలుస్తోంది. ఈ విషయాన్ని మంగళవారం ఆయన కంపెనీలోని సీనియర్ ఉద్యోగులకు తెలియజేసినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు వెల్లడించారు. సంస్థ సామర్థ్యం అంచనాలను అందుకోలేని ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగులపైనా వేటు పడొచ్చు. సీనియర్ మేనేజ్‌మెంట్‌పై వెచ్చిస్తున్న ఖర్చును తగ్గించుకునే క్రమంలో ఆ విభాగం వారిపై ఎక్కువ ప్రభావం ఉండనుందని తెలుస్తోంది. ఫలితంగా ఉద్యోగుల వేతనాల కోసం వెచ్చిస్తున్న వ్యయాన్ని తగ్గించుకోవాలన్నది కీలక ప్రణాళిక. అలాగే వివిధ విభాగాలను విలీనం చేసి అన్నింటినీ బైజూస్ కిందకే తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారని తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లోనే సంస్థ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండు విభాగాల్లోనూ ఒకే సిబ్బందిని ఉంచాలని యోచిస్తోంది. దీంతో అదనంగా ఉన్నవారిని బయటకు పంపనున్నారు. కరోనా సమయం 2021లో బైజూస్‌లో 52వేల మంది పని చేయగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 35వేలకు తగ్గిందని అంచనా.. భవిష్యత్తులో మరింత మందికి ఉద్వాసనలు పలకడంతో సిబ్బంది సంఖ్య ఎంతకు చేరనుందో వేచి చూడాలి.

## బెయిల్ వచ్చి మూడేళ్లు.. అయినా జైలులోనే

- గుజరాత్‌లో అధికారుల నిర్లక్ష్యం

**గాంధీనగర్ :** ఒక కేసులో శిక్ష అనుభవిస్తోన్న వ్యక్తికి న్యాయస్థానం బెయిల్ ఇచ్చినప్పటికీ.. అందుకు సంబంధించి ఈ-మెయిల్‌లో వచ్చిన ఆర్డరు కాపీని అధికారులు తెరవకపోవడంతో అతను మూడేళ్లపాటు జైల్లోనే ఉండాల్సి వచ్చింది. ఈ ఘటన గుజరాత్‌లో చోటు చేసుకుంది. దీన్ని తీవ్రంగా పరిగణించిన గుజరాత్ హైకోర్టు నిందితుడికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గుజరాత్‌కు చెందిన చందన్‌జీ ఠాకూర్ (27) ఓ హత్య కేసులో దోషి. దీంతో అతడు జీవితఖైదు అనుభవిస్తున్నాడు. అయితే, సెప్టెంబర్ 29, 2020న అతడి శిక్షను గుజరాత్ హైకోర్టు నిలిపివేసింది. ఇందుకు సంబంధించి హైకోర్టు రిజిస్ట్రీ జైలు అధికారులకు ఆర్డరు కాపీని ఈ-మెయిల్‌లో పంపించింది. కానీ, జైలు అధికారులు మాత్రం మెయిల్‌లో ఉన్న అటాచ్‌మెంట్‌ను తెరచి చూడలేదు.

## ముగిసిన సుదీర్ఘ అంతరిక్ష యాత్ర

- క్షేమంగా భూమికి తిరిగొచ్చిన వ్యోమగాములు

**వాషింగ్టన్ :** నాసా వ్యోమగామి ఫ్రాంక్ రూబియో, రష్యా వ్యోమగామి సెర్గే ప్రొకోపీవ్, దిమిత్రి పెటెలిన్‌లు తమ సుదీర్ఘ అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించుకొని బుధవారం భూమిని చేరారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి సోయుజ్ ఎంఎస్-23 స్పేస్ క్రాఫ్ట్‌లో బయలుదేరిన వీరు కజక్‌స్థాన్‌లో సురక్షితంగా ల్యాండ్ అయ్యారు. ఈ ప్రయాణం 157.4 మిలియన్ మైళ్లు. వాస్తవానికి ఈ మిషన్ ఆరు నెలల్లోనే పూర్తి కావాల్సి ఉంది. అయితే, 2022 డిసెంబరులో రష్యన్ స్పేస్ క్రాఫ్ట్‌లో ఊహించని లీక్ చోటు చేసుకోవడంతో గడువు పొడిగించారు. దాంతో వ్యోమగాములు అంతరిక్షంలో 371 రోజులు గడపాల్సి వచ్చింది. నిర్దేశించిన సమయం కన్నా ఎక్కువ రోజులు అంతరిక్షంలో గడపాలనే విషయం తెలిసినా రూబియో, ప్రొకోపీవ్, దిమిత్రిలు వెనక్కి తగ్గలేదు. సవాళ్లను ఎదుర్కొంటూనే తమ విధులు నిర్వహించారు. వారి అంకితభావం అంతరిక్షంలో మానవ జీవితంపై అవగాహనను మెరుగుపర చడమే కాకుండా.. భవిష్యత్ వ్యోమగాములకు ఓ మార్గదర్శకంగా నిలిచిందని ఖగోళ శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు. అంతకముందు నాసా వ్యోమగామి మార్క్ వాన్ డే హే 355 రోజులు గడిపి రికార్డు సృష్టించారు.

## ఆరు రాష్ట్రాల్లో ఎన్ఐఎ సోదాలు

**న్యూఢిల్లీ :** జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) బుధవారం ఆరు రాష్ట్రాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌ల్లో 50 చోట్ల ఈ దాడులు జరిగాయి. ఖలిస్థానీ అంశంపై విచారణలో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. భారత్‌లోని ఖలీస్థానీ మద్దతుదారులకు ఇతర దేశాల నుంచి హవాల మార్గంలో డబ్బులు వస్తున్నాయని.. వీటిని ఉపయోగించి వారు డ్రగ్స్, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నారని ఎన్ఐఎ ఆరోపిస్తుంది. వీరికి పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ నుంచి సహకారం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఉపా కింద అరెస్టు చేసిన వారి నుంచి ఈ సమాచారం సేకరించినట్లు తెలిపారు. బుధవారం పంజాబ్‌లో 30 చోట్ల, రాజస్థాన్‌లో 13, హర్యానాలో నాలుగు చోట్ల, ఉత్తరాఖండ్‌లో రెండు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లో ఒక్కో చోట తనిఖీలు బుధవారం సాయంత్రం వరకూ సోదాలు జరిగాయి.

## అణ్వాయుధ నిర్మూలన అవశ్యం: ఐరాస చీఫ్

**ఐక్యరాజ్య సమితి :** అణ్వాయుధాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటె రస్ మంగళవారం పిలుపిచ్చారు. "అణ్వా యుధాల సంపూర్ణ నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ఐరాస జనరల్ అసెంబ్లీలో గుటెరస్ మాట్లాడుతూ, అణ్వా యుధాల వినియోగాన్ని నివారించడానికి గల ఏకైక వాస్తవిక మార్గం వాటిని సమూలంగా నిర్మూలించడమేనన్నారు. ఈ ప్రాథమిక సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. ఏ అణ్వాయుధాన్నైనా,ఎక్కడైనా, ఏ సందర్భంగానైనా ఉపయోగించామంటే, మానవ వినాశనానికి ద్వారాలు తెరిచినట్లేనని ఆయన హెచ్చరించారు.కొత్తగా అణ్వాయుధ పోటీ తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది. మొదటిసారిగా అణ్వాయుధాల సంఖ్య పెరగబోతుంది. వాటి వినియోగం, వ్యాప్తి, పరీక్షలను నివారించడం కోసం రూపొందించుకున్న నిబంధనలు, షరతులకు ఇది విఘాతం కలిగిస్తోంది. అంతర్జాతీయ నిరాయుధీకరణ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధకం వంటి అంశాలు తుడిచిపెట్టుకు పోతున్నాయి. అణ్వాయుధాలను మరింత వేగంగా, ఖచ్చితంగా, బలంగా ఉపయోగించేలా ఆధునీకరించబడుతున్నాయి. ఇది మానవాళికే ప్రమాదం. సుదీర్ఘ చర్చల తరువాత రూపొందించుకున్న అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందాలు, అణు నిరాయుధీకరణ ఒప్పందాలను మరింత నిబద్ధతతో అమలు చేయాల్సిన అవసరం వుందని చెప్పారు.

## ఆడంబర వివాహాలు వద్దు : సిద్ధరామయ్య

**బెంగళూరు :** ప్రజలు అప్పులు చేసి మరీ ఆడంబరంగా పెళ్లిళ్లు చేసుకోవడం మానుకోవాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సూచించారు. చామరాజనగర్‌లోని ఎం.ఎం. హిల్స్ ఆలయంలో నిర్వహించిన సామూహిక వివాహాల వేడుకకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు బయట రుణాలు తీసుకొచ్చి ఆర్భాటంగా పెళ్లిళ్లు చేయడం ఎంత మాత్రం మంచి పద్ధతి కాదని చెప్పారు. కొందరు వ్యవసాయ రుణాలు తీసుకొని సమాజంలో పేరు కోసం ఘనంగా వివాహాలు చేస్తున్నారన్నారు. పేద, శ్రామిక వర్గాల ప్రజలు ఆడంబరాల కోసం చేసిన అప్పులను తీర్చడానికి జీవితాంతం కష్టపడాల్సి వస్తోందన్నారు.

## గురి తప్పని షూటర్లు




- సిఫ్ట్ కౌర్ సింగ్ ప్రపంచ రికార్డు
- రైఫిల్-3 పొజిషన్, 25మీ. పిస్టోల్ విభాగాల్లో భారత్‌కు స్వర్ణాలు
- హైదరాబాద్ అమ్మాయి ఈషా సింగ్‌కు రెండు పతకాలు

25మీ. పిస్టోల్ టీమ్ విభాగంలో స్వర్ణం నెగ్గిన భారత బృందం

10మీ. ఎయిర్ రైఫిల్‌లో బంగారు పతకం సాధించిన పురుషుల జట్టు

**హాంగ్జౌ:** 19వ ఆసియా క్రీడల్లో నాల్గోరోజు భారత షూటర్లు అదరగొట్టారు. మహిళల 50మీ. రైఫిల్-3 పొజిషన్‌లో సిఫ్ట్ కౌర్ శర్మ ప్రపంచ రికార్డును నమోదు చేసింది. నాల్గోరోజు బుధవారం పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్, మహిళల 25మీ. పిస్టోల్ టీమ్ విభాగాల్లో భారత్‌కు స్వర్ణ పతకాలు దక్కాయి. పురుషుల స్కీట్‌లో అనంత్‌జీత్ సింగ్, మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ టీమ్, మహిళల వ్యక్తిగత 25మీ. పిస్టోల్ విభాగంలో ఈషా సింగ్ రజత పతకాలను సాధించారు. అలాగే మహిళల 50మీ. రైఫిల్-3 పొజిషన్‌లో భారత్‌కు మరో రజతం దక్కింది. పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్, పురుషుల 25మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టోల్‌తోపాటు మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్‌లో రమిత కాంస్య పతకాలను సాధించారు. సెయిలింగ్ ఐఎల్‌సిఏ 7 విభాగంలో విష్ణు శరవణన్ కాంస్యం సాధించాడు. నాల్గోరోజు భారత్‌కు దక్కిన పతకాల్లో సెయిలింగ్ మినహా.. మిగతా పతకాలన్నీ షూటింగ్‌లో వచ్చాయి.

**మెరిసిన ఈషా సింగ్...**

హైదరాబాద్ అమ్మాయి ఈషా సింగ్ షూటింగ్‌లో మెరిసింది. మహిళల 25మీ. పిస్టోల్ విభాగంలో స్వర్ణం కైవసం చేసుకోగా.. వ్యక్తిగత 25మీటర్ల పిస్టోల్ విభాగంలో రజత పతకాన్ని ఒడిసిపట్టుకుంది. 25మీ. పిస్టల్ విభాగంలో మను బాకర్, రిథిమ్ సంగ్వాన్, ఈషా సింగ్‌లతో కూడిన భారత మహిళల జట్టు 1759 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచింది.

**సెయిలింగ్‌లో విష్ణు శరవణన్‌కు కాంస్యం**

సెయిలింగ్‌లో భారత్‌కు మరో పతకం దక్కింది. పురుషుల డింగీ ఐఎల్‌సిఏ-7 విభాగంలో 24 ఏళ్ల విష్ణు శరవణన్ 34 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకున్నాడు. సింగపూర్ సెయిలర్‌లో జున్ హాన్ ర్యాన్ స్వర్ణం, దక్షిణకొరియా సెయిలర్ జీమిన్ రజత పతకాలు సాధించారు. పురుషుల విండ్ సర్ఫర్ ఈవెంట్‌లో మరో సెయిలర్ ఇబాద్ అలీ కాంస్యం ఖాయం చేశాడు. ఈ రేసులో 52 పాయింట్లతో ఇబాద్ అలీ మూడో స్థానంలో నిలిచాడు. దీంతో భారత్ పతకాల సంఖ్య 22కి చేరింది. ఇందులో ఐదు స్వర్ణాలు, ఏడు రజతాలు, 10 కాంస్య పతకాలు ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ ఆరో స్థానంలో కొనసాగుతోంది.

## తొమ్మిది బంతుల్లోనే అర్ధసెంచరీ

**నేపాల్ బ్యాటర్ విధ్వంసం.. యువరాజ్ రికార్డు బద్దలు..**




ఆసియా క్రీడల పురుషుల టి20 క్రికెట్‌లో నేపాల్ జట్టు బ్యాటర్ విధ్వంసం సృష్టించింది. గ్రూప్-ఎలో భాగంగా జరిగిన మంగోలియాతో జరిగిన మ్యాచ్‌లో దిపేంద్ర సింగ్ కేవలం 9బంతుల్లో 8సిక్సర్ల సాయంతో అర్ధసెంచరీ కొట్టాడు. దీంతో యువరాజ్ సింగ్(12బంతుల్లో అర్ధసెంచరీ) పేరిట ఉన్న రికార్డును బ్రద్దలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 20ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 314 పరుగులు చేసింది. కుషాల్ మల్ల (137నాటౌట్; 50బంతుల్లో, 8ఫోర్లు, 12సిక్సర్లు) విధ్వంసానికి తోడు.. కెప్టెన్ రోహిత్ పడేల్ (61; 27బంతుల్లో, 2ఫోర్లు, 6సిక్సర్లు) అర్ధసెంచరీతో మెరిసారు. ఛేదనలో మంగోలియా జట్టు 41 పరుగులకే ఆలౌటైంది. దీంతో నేపాల్ జట్టు 273 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో నేపాల్ టి20 ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన, భారీ విజయాన్ని నమోదు చేసిన జట్టుగా రికార్డు నెలకొల్పింది.

## మూడో వన్డేలో నిరాశ

- రోహిత్, కోహ్లి శ్రమ వృధా
- మ్యాక్స్‌వెల్ మ్యాజిక్ బౌలింగ్
- సిరీస్ 2-1తో భారత్ కైవసం

**రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో వన్డేలో భారత్ ఓటమిపాలైంది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 353పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా 286పరుగులకే కుప్పకూలింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-1తో చేజిక్కించుకుంది. తొలుత ఆస్ట్రేలియా జట్టులో వార్నర్(56), మార్ష్(96), స్మిత్(74), లబూషేన్(72) రాణించడంతో ఆ జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 352పరుగులు చేసింది. భారతజట్టులో రోహిత్(86), కోహ్లి(52) బ్యాటింగ్‌లో రాణించారు.**

### పతకాల పట్టిక

| వ.స. | దేశం | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1. | చైనా | 76 | 43 | 21 | 140 |
| 2. | కొరియా | 19 | 18 | 33 | 70 |
| 3. | జపాన్ | 15 | 27 | 24 | 66 |
| 4. | ఉజ్బెకిస్తాన్ | 6 | 10 | 12 | 28 |
| 5. | థాయ్‌లాండ్ | 6 | 3 | 8 | 17 |
| 6. | హాంకాంగ్ | 5 | 8 | 14 | 27 |
| 7. | ఇండియా | 5 | 7 | 10 | 22 |
| 8. | ఇండోనేషియా | 3 | 2 | 7 | 12 |
| 9. | సింగపూర్ | 2 | 3 | 4 | 9 |
| 10. | చైనీస్ తైపీ | 2 | 3 | 4 | 9 |

స్వ:స్వర్ణాలు; ర:రజితం; కా:కాంస్యం మొ:మొత్తం

## ఆస్కార్ బరిలో '2018'

ఆస్కార్-2024 బరిలో ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ కేటగిరిలో మలయాళ చిత్రం '2018' పోటీ పడనుంది. కేరళ వరదల నేపథ్యంలో తీసిన ఈ సినిమా అందరి ప్రశంసలు అందుకోవటమే కాక భారీ వసూళ్ళను రాబట్టింది. మలయాళ నటుడు టోవినో థామస్ ఈ సినిమాలో ముఖ్య పాత్ర ధరించారు. కన్నడ దర్శకుడు గిరీష్ కాసరవెల్లి అధ్యక్షతన 17 మంది సభ్యులతో కూడిన ఒక కమిటీ ఇటీవల చెన్నైలో 22 సినిమాలను వీక్షించి, '2018'ని ఆస్కార్ బరికి ఎంపిక చేసారని తెలిసింది. 'దసరా', 'బలగం' లాంటి దేశీయ భాషా చిత్రాలు పరిశీలనకు వెళ్లాయి.

## లియో ఆడియో ఫంక్షన్ రద్దు

'లియో ఆడియో ఫంక్షన్‌కి విజయ్ అభిమానులు చాలామంది వచ్చే అవకాశం వుంది, అందరికీ ఎంట్రీ పాస్‌లు ఇవ్వడం కుదరకపోవచ్చు. ఇంతమంది అభిమానులు రావటం వలన, భద్రతా కారణాల దృష్ట్యా ఈ ఆడియో రిలీజ్ ఫంక్షన్ రద్దు చెయ్యాలని అనుకున్నాం' అని చిత్ర నిర్మాతలు తాజాగా ట్వీట్ చేశారు. సెప్టెంబరు 30న ఆడియో ఫంక్షన్ జరగాల్సి ఉంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్ రద్దు వెనక ఎటువంటి రాజకీయ ఒత్తిడి లేదని కూడా ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ సినిమా అక్టోబర్ 19న విడుదలవుతోంది.

## 'పెదకాపు-1' అలరిస్తుంది విరాట్ కర్ణ

పెదకాపు-1 సినిమా సినీ ప్రేక్షకులందరికీ అలరిస్తుందని హీరో విరాట్ కర్ణ చెప్పారు. డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన 'పెదకాపు-1'. ఈనెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో విరాట్ కర్ణ వివరాలను వెల్లడించారు. పెదకాపు పార్ట్ 2, 3 కూడా ఉంటాయని అన్నారు.

## 3న టైగర్ నాగేశ్వరరావు ట్రైలర్

హీరోగా రవితేజ, హీరోయిన్లుగా నుపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ నటిస్తున్న సినిమా 'టైగర్ నాగేశ్వరరావు'. ట్రైలర్ అక్టోబర్ 3న విడుదల కానుంది. ఈ సినిమా అదే నెల 20న దేశ వ్యాప్తంగా విడుదల కానున్నట్లుగా చిత్ర నిర్మాతలు ప్రకటించారు. జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఇప్పటివరకూ రెండు పాటలను విడుదల చేశారు. సినిమాటోగ్రఫీ ఆర్ మదీ ఐఎస్‌సి, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్. శ్రీకాంత్ విస్సా డైలాగ్ రైటర్ కాగా, మయాంక్ సింఘానియా సహ నిర్మాత. రచన, దర్శకత్వం వంశీ, నిర్మాత అభిషేక్ అగర్వాల్, సహ నిర్మాత మయాంక్ సింఘానియాగా వ్యవహరిస్తున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68